PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 212 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 30 జులై 2025


## మానవత్వం చాటుకున్న రాహుల్




## జాతీయ క్రీడాకారుడు శశాంక్‌ని పరామర్శించిన సోదా రామకృష్ణ






## కాలుష్య రహిత నగరంగా

# హైదరాబాద్

**25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు**

**పాతికేళ్ల అవసరాలకు తగ్గట్లుగా ప్రణాళికలు రూపొందించాలి**

**మెట్రో పనులను వేగవంతం చేయాలి**

**ఎంపయూడి సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,29 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌ని కాలుష్యరహితంగా మార్చేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వచ్చే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారంరాష్ట్ర సచివాలయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం మిగతాది 2లో...

## కాల్పుల విరమణలో మూడో దేశం

# జోక్యం లేదు



**ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనను తోసిపుచ్చిన మోడీ**

**ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకలకు బుద్ధి చెప్పాం**

**సిందూర్‌లో త్రివిధ దళాలు సత్తా చాటాయి**

**కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేసిన త్రివిధ దళాలు**

**ఆపరేషన్‌పై కాంగ్రెస్, విపక్షాల తీరు దారుణం**

**సైన్యం స్థైర్యం దెబ్బతినేలా వ్యాఖ్యాలు**

**హెడ్‌లైన్స్‌లో ఉండేలా చేస్తున్న వారికి ప్రజల్లో స్థానం లేదు**

**ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో ప్రధాని మోడీ సమాధానం**

**న్యూఢిల్లీ,జులై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):**'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో రెండో రోజు చర్చలు వాడీవేడీగా సాగాయి. ప్రతిపక్షం సంధించిన ప్రశ్నలకు ప్రధాన పక్షమైన మోడీ బృందం దీటుగా బదులిచ్చింది. మంగళవారం జరిగిన చర్చలో ప్రధాని నరేంద్ర మోడీ సహా హోం మత్రి అమిత్ షా ప్రతిపక్షాల అభ్యంతరాలను కొట్టిపారేశారు. సభ్యులందరి సమక్షంలో కాల్పుల విరమణలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రమేయం లేదని మోడీ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిందని ప్రధాని మిగతా2లో...



## పదండి ప్రజల్లోకి..

**స్థానిక ఎన్నికల్లో గెలిచి తీరాల్సిందే: మీనాక్షి నటరాజన్**

**హైదరాబాద్,29(పిసిడబ్ల్యూ న్యూస్):**'స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాల్లో విజయం సాధించాల్సిందేనని ..' ఏఐసిసి నాయకురాలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ నాయకులకు, మిగతాది 2లో...

## భూ వివాదం కేసులో రేవంత్ రెడ్డికి

# ఊరట

**పెద్దిరాజు తదితరులు వేసిన పిటిషన్ తిరస్కరణ**

**ఫిర్యాదుదారుకు కోర్టు నోటీసులు**



**న్యూఢిల్లీ,29 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. భూవివాదం కేసులో ఎన్ పెద్దిరాజు వేసిన కేసులో.. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు క్వాష్ చేసింది.అయితే హైకోర్టు ఆదేశాలపై ఎన్ పెద్దిరాజు సుప్రీం కోర్టులో సవాలు వేశారు. ఈ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ సుప్రీంను మిగతాది 2లో...

## రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను

# ఆధునికరిస్తాం

**ప్రాజెక్టుల్లో పేరుకున్న పూడికను తొలగిస్తాం**

**26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న సాగర్**

**మంత్రి అడ్లూరితో కలసి సాగర్ గేట్లు ఎత్తిన మంత్రి ఉత్తమ్**



**నాగార్జునసాగర్,29 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తా మని, అలాగే పూడిక తీస్తామని ,రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ,మైనారిటీ సంక్షేమ శాఖల మిగతాది 2లో...

# కాళేశ్వరం నివేదిక సిద్ధం

**సీల్డ్ కవర్‌లో సిద్ధం చేసిన పిసి ఘోష్ కమిషన్**

**త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించే అవకాశం**



**హైదరాబాద్,29 (పిసిడబ్ల్యూ న్యూస్):**కాళేశ్వరం కమిషన్ నివేదికను పీసీ ఘోష్ కమిషన్ త్వరలోనే ప్రభుత్వంకు ఇవ్వనుందని తెలుస్తోంది. ప్రస్తుతం కాళేశ్వరం కమిషన్ నివేదికను సీల్డ్ కవర్‌లో ఉంచారు. దాదాపు 500 పేజీలతో తుది నివేదికను కమిషన్ ఇవ్వనుంది. 3 వేల పేజీలతో మొత్తం డాక్యుమెంట్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆగస్టు ఒకటి లేదా రెండో తేదీన నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి నివేదికను స్వీకరించి..ప్రభుత్వానికి మిగతాది 2లో...




## గోదావరి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా బి.పి పాండే

**హైదరాబాద్, 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం గోదావరి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా బి.పి.పాండే నియమిస్తూ కేంద్ర జలశక్తి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మిగతాది 2లో...

## రాష్ట్ర రైతాంగ సంక్షేమం కోసం రాజీలేని

# పోరాటాలు చేయాలి : కేసీఆర్



**హైదరాబాద్,జులై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో రాష్ట్ర రైతాంగ సంక్షేమం కోసం.. వ్యవసాయ సంక్షోభాన్ని నివారించడం కోసం.. రాజీ లేని పోరాటాలు మరింత ఉధృతం చేయాలి అని బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాగునీటి రంగాన్ని ఆగం చేసే దిశగా.. ఆంధ్రా ప్రభుత్వం నిర్మించనున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ నిలువరించాల్సిందే అని కేసీఆర్ తేల్చిచెప్పారు. అందుకు బీఆర్ఎస్ పార్టీ మిగతాది 2లో...

## 20 నెలల్లోనే కాంగ్రెస్‌పై

# తీవ్ర వ్యతిరేకత..



**స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి : కేటీఆర్**

**రాజన్న సిరిసిల్ల,జులై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** 20 నెలల కాల వ్యవధిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. సిరిసిల్లలో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.మీ అందరిలో ఒకడిగా ఉంటాను. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ కు మంచిరోజులు రాబోతున్నయి. ఇప్పుడు ప్రజలకు కేసీఆర్ విలువ తెలుస్తుంది. స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పట్టుదలతో పని చేయాలి. బూత్ స్థాయిలో మెజారిటీ తీసుకురావాలి. ఎంత పెద్ద నాయకుడైన ఊర్లో మెజారిటీ తీసుకురావాలి. చినుకు చినుకు కలిసి వరద అయినట్లు ప్రతి ఒక్క ఓటును రాబట్టుకోవాలి. పోయిన కాడనే వెతుక్కోవాలి.. మళ్లీ గులాబీ జెండా ఎగురవేయాలి. ప్రతి ఒక్కరికి సమాధానం చెప్పాలంటే ప్రతి సీటు గెలవాలి అని కేటీఆర్ మిగతాది 2లో...

## యూరియాపై ప్రభుత్వం

# తప్పుడు లెక్కలు



**లెక్కకు మిక్కలిన యూరియా ఎక్కడుంది**

**ప్రభుత్వం తక్షణమే జవాబు చెప్పాలి**

**జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా సున్నా**

**ఖమ్మం ఇక బిజెపి అడ్డా కాబతోంది**

**బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ దోబూచులాల**

**జిల్లా పర్యటనలో కార్యకర్తల సమావేశంలో బిజెపి అధ్యక్షుడు రామ్**

**ఖమ్మం,జులై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అందజేస్తున్న యూరియా లెక్కలకు సంబంధించి రేవంత్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. తెలంగాణకు ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటివరకు 6.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాని కేందప్రభుత్వం అందజేసిందని స్పష్టం చేశారు. మిగతాది 2లో...

PCW తెలుగు దినపత్రిక

బుధవారం 30 జులై 2025

# కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో పలు కీలక అంశాలపై చర్చించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్‌లని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గ నిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో కాలుష్య నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపాలని.. ఇందుకు సంబంధించి ఢిల్లీ, బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లో సమస్యలను అధ్యయనం చేయాలని దిశానిర్దేశర చేశారు. హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రాకుండా పరిష్కార మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# కాల్పుల విరమణలో మూడో దేశం జోక్యం లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు.' దయచేసి దాడులు ఆపండి' అని పాక్ డీజీఎంఓ మన డీజీఎంఓను వేడుకోవడంతోనే కాల్పుల విరమణకు అంగీకరించామని సభకు మోడీ వివరించారు.భారత్, పాకిస్థాన్ యుద్ధం విరమణలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాత్ర లేదని ప్రధాని ధైర్యంగా చెప్పాలని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. మోడీకి దమ్ముంటే ట్రంప్ అబద్ధాలకోరు అని సభా వేదికగా చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత సవాల్‌ను స్వీకరించిన మోడీ తమకు యుద్ధం ఆపాలని ఏ దేశాధినేత చెప్పలేదని స్పష్టం చేశారు. అంతేకాదు ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తనకు మూడు నాలుగు సార్లు కాల్ చేసి.. పాక్ భారీ దాడికి సిద్ధమవుతోందని హెచ్చరించారని మోదీ అంగీకరించారు. కానీ, తాను మాత్రం మేము పాక్‌కు దీటుగా బదులిస్తామని ఆయనతో చెప్పినట్టు ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.**ఆ పార్టీ కారణంగానే..**ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచం మద్దతు తమకు లభించిందని, కానీ కాంగ్రెస్ మద్దతు లభిచండం లేదని మోడీ అన్నారు. అంతేకాదు ఆ పార్టీ కారణంగానే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కోల్పోయామని ఆయన విమర్శించారు. పీఓకే ఒక్కటే కాదు సింధు జలాల ఒప్పందం కూడా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని, మాజీ ప్రధాని నెహ్రూ పాకిస్థాన్‌కు డ్యాంలు కట్టుకునేందుకు డబ్బులు కూడా పంపారని మోడీ ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక స్వదేశీ పరిజ్ఞానంతో క్షిపణి వ్యవస్థను పటిష్ఠం చేశామని ప్రధాని సభికులకు తెలియజేశారు.ఆపరేషన్ సిందూర్‌తో దాయాదికి భారత్ మూడు విషయాల్ని చాలా స్పష్టంగా అర్థమయ్యేలా చేసిందని మోడీ అన్నారు. ఒకవేళ భారత్‌పై ఉగ్రదాడికి పాల్పడితే.. మేము మాదైన స్టయిల్లో.. సమయం చూసుకొని బదులిస్తాం. మా వద్ద అణ్వాయుధాలు ఉన్నాయని పాక్ చేసే బ్లాక్ మెయిల్స్‌కు మేము వెరవం. ఇక మూడోది.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ప్రభుత్వాన్ని.. ఉగ్రవాదులను మేము వేర్వేరుగా చూడము అని మోదీ పేర్కొన్నారు.

# పదండి ప్రజల్లోకి..

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులను, కార్యకర్తలు ఆమె పరుగులు పెట్టిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 31 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ తొలి విడత పాదయాత్ర, పల్లె నిద్ర, శ్రమదానం చేయడానికి త్రిముఖ వ్యూహాన్ని ఆమె ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యే క్వార్టర్‌లో సమావేశమయ్యారు. పది ఉమ్మడి జిల్లాల పార్టీ ఇన్‌ఛార్జిలు, పార్లమెంటు వారీగా నియమితులైన ఇన్‌ఛార్జిలుగా నియమితులైన ఉపాధ్యక్షులు, పిసిసి ప్రధాన కార్యదర్శులు, జిల్లా పార్టీ అధ్యక్షులూ హాజరయ్యారు. అయితే ఆమె జిల్లాల వారీగా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పాదయాత్రలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని, జన సమీకరణ, భారీ ఏర్పాట్లు, పెద్ద ఎత్తున కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం గురించి మీనాక్షి సూచన చేశారు. 31న రంగారెడ్డి జిల్లా పరిగిలో సాయంత్రం 5 గంటలకు పాదయాత్రకు ఆమె శ్రీకారం చుట్టనున్నారు. మీనాక్షి నటరాజన్‌తో పాటు పిసిసి అధ్యక్షుడుఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పార్టీ నాయకులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లూ పాదయాత్రలో పాల్గొంటారు.

# గోదావరి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా బి.పి పాండే

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీలో గోదావరి నదీ యాజమాన్య బోర్డు ఆఫీసు తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించిన నేపథ్యంలో ప్రస్తుతం కొత్త ఛైర్మన్ ను నియమించడం పట్ల ఆసక్తి నెలకొంది. గోదావరి నదీ యాజమాన్య బోర్డు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం 2014 సెక్షన్ 85 కింద మే 28 ఏర్పాటు చేశారు. ఈ బోర్డు కేంద్ర జలశక్తి అధీనంలో పని చేస్తుంది. గోదావరి నదిపై ప్రాజెక్టుల నిర్మాణం, నీటి వాటాల నిర్వహణ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నీటి వివాదాల పరిష్కారంపై ఇది పనిచేస్తుంది. కాగా ప్రస్తుతం బోర్డు ఛైర్మన్ గా ఏకే ప్రధాన్ బాధ్యతలు నిర్వహిస్తుండగా కేంద్ర జలశక్తి శాఖ బి.పి.పాండేను కొత్త ఛైర్మన్ గా నియమించింది. తెలుగు రాష్ట్రాల మధ్య పోలవరం- బనకచర్ల లింక్ ప్రాజెక్టు వివాదంపై కొత్త ఛైర్మన్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# రాష్ట్ర రైతాంగ సంక్షేమం కోసం రాజీలేని పోరాటాలు చేయాలి : కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

శ్రేణులను క్షేత్ర స్థాయిలో పోరాటాల కోసం కార్యోన్ముఖులను చేయాలని పార్టీ శ్రేణులకు అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

# 20 నెలల్లోనే కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత..

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు.గత పదేళ్ళలో ప్రజలకు చేయాల్సిన పనులన్నీ చేశాము. ప్రజలు కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మి మోసపోయారు. రైతులకు కేసీఆర్ సాగునీళ్లు, రైతుబంధు, రైతుభీమా ఇచ్చారు. కార్యకర్తలందరూ కలిసి పని చేయాలి. మనం కూసున్న చెట్టు కొమ్మను మనమే నరుక్కున్నాము. ప్రజలంతా బీఆర్ఎస్‌కే ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రతి రైతు తినే పళ్ళెంలో మట్టి పోసుకున్నామని బాధపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు లేదు. రైతుబంధు రాదు, రైతు బీమా రాదు, బోనస్ రాదు. కానీ ఓట్లు ఉన్నప్పుడే నోట్లు వేస్తున్నాడు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.రైతులకు యూరియా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక ప్రభుత్వం మోసం చేస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని మభ్యపెట్టారు. రిజర్వేషన్ల కోసం ఢిల్లీ పోయి ధర్నా చేస్తామంటున్నారు.. కూట్లే రాయి తీయనోడు ఏట్లే రాయి తీస్తామంటున్నారు. సీఎం చేతిలో ఉన్న పనులు చేయడం లేదు. రేవంత్ రెడ్డిని తిడితే.. బండి సంజయ్‌కి ఏం నొప్పి. తెలంగాణలో గులాబీ జెండా లేకుండా చేయాలి గోదావరి నీళ్లు ఆంధ్రకు వదిలేయాలి.. అనేది బండి సంజయ్, రేవంత్ రెడ్డి గూడుపుటాని. కేసీఆర్ ఉంటే నీళ్లు, నిధులు ఎవరికి పోనియ్యడనే దురుద్దేశ్యంతో రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కుట్రలు చేస్తున్నారు అని కేటీఆర్ మండిపడ్డారు.కులం,మతం ముసుగులో మళ్ళీ మోసపోవద్దు. మహిళలకు 2500లు అన్నాడు హామీ ఏమైంది ఒక్కో మహిళకు రేవంత్ రెడ్డి 50వేలు బాకీ ఉన్నాడు. సీఎం రేవంత్ రెడ్డి పిచ్చోడిలా వ్యవహరిస్తున్నారు. సీఎం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ఢిల్లీ పోయి రేవంత్ రెడ్డి పీకిందేమి లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఫాల్తూ మాటలు మాట్లాడుతున్నారు. సీఎం తిట్టుడు బంద్ చేస్తే నేను తిట్టుడు బంద్ చేస్తా. సీఎం దిక్కుమాలిన పనులు చేస్తున్నాడు. ప్రజలు నమ్మి మోసపోయారు. ప్రజలు స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కడితే మళ్లీ రాష్ట్రంలో గులాబీ జెండా ఎగురుతుంది. కార్యకర్తలు బేషజాలకు వెళ్లొద్దు అని కేటీఆర్ సూచించారు.

# భూ వివాదం కేసులో రేవంత్ రెడ్డికి ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ఆశ్రయించారు.ఆ పిటిషన్‌లో హైకోర్టు తీర్పునకు సంబంధించిన అంశాలతో పాటూ జడ్జి పైన అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు- సమాచారం. ఎన్ పెద్దిరాజు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. అలాగే ఎన్ పెద్దిరాజుతో పాటు-, ఆయన అడ్వకేట్ రితేష్ పాటిల్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీజేఐ బీఆర్ గవాయి తదుపరి విచారణకు పిటిషనర్ అండ్ పెద్దిరాజు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు. భూ వివాదం వ్యవహారంలో సొసైటీ- స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్య పై పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తనపై కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఫిర్యాదు దారు ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. రేవంత్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పు అనంతరం.. కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిష్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం డిస్మిస్ చేసింది.పిటిషన్‌లో.. ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఒక న్యాయవాదిగా న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేస్తూ .. పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్.పెద్దిరాజుతోపాటు- ఆయన తరఫు న్యాయవాది రితేష్ పాటిల్‌కు ధర్మాసనం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు పిటిషనర్ పెద్దిరాజు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. కోర్టు సాక్షిగా పిటిషనర్ తరఫు న్యాయవాది రితీష్ పాటిల్ క్షమాపణ కోరారు. అందుకు నిరాకరించిన సీజేఐ.. పిటిషన్ రాసేటప్పుడు, దాఖలు చేసేటప్పుడు గుడ్డిగా ఎలా వేశారని ప్రశ్నించారు. పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతివ్వాలని న్యాయవాది రితీష్ పాటిల్ కోరగా.. అందుకు సీజేఐ నిరాకరించారు. పిటిషన్ దాఖలు చేసే ముందు న్యాయవాదిగా అన్ని విషయాలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. కోర్టు ధిక్కరణ నోటీసుపై లిఖిత పూర్వకంగా సమాధానం ఆదేశించారు. సమాధానం ఆమోదయోగ్యంగా ఉంటేనే కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేస్తూ... విచారణ ఆగస్టు 11కు వాయిదా వేశారు.

# రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు. నాగార్జున సాగర్ మనకు ఆధునిక దేవాలయం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సాగర్ నుంచి గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 18 ఏళ్ల తర్వాత జులైలోనే నాగార్జున సాగర్ జలాశయం నిండిందని తెలియజేశారు. సాగర్ కు దివంగత ప్రధాని నెహ్రూ గాంధీ పునాది వేస్తే దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించిన గొప్ప ప్రాజెక్టు ఇది అని కొనియాడారు. సాగర్ కాలువల ద్వారా రెండు రాష్ట్రాల్లోని ప్రతీ ఎకరాకు నీరు చేరిందని, మన రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి పండిందని ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని 22 లక్షల ఎకరాలకు సాగునీరుతుందని చెప్పారు .జవహర్ కుడి కాలువ ద్వారా 11.74 లక్షల ఎకరాలు, లాల్ బహదూర్ ఎడమ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు- వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 6 లక్షల 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుండగా, నల్గొండ జిల్లాలో 1,50,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో రెండు లక్షల 30 వేల ఎకరాలు ,ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతున్నదని తెలిపారు. 2005 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్వర్ణోత్సవాలు. నిర్వహించడం జరిగిందని చెప్పారు. తను ఆరుసార్లు శాసనసభ్యుడిగా,ఒకసారి పార్లమెంటు సభ్యునిగా ఉంటూ ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టు మంత్రిగా నాగార్జున సాగర్ ద్వారా నీటిని వదలడం సంతోషంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటు- అయిన తర్వాత గత వానాకాలం,యాసంగి , వానాకాలం కలిసి రెండు లక్షల 81 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని. పండించడం జరిగిందని, ఇందులో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పాత్ర ముఖ్యమని అన్నారు. సాగునీటితో పాటు- నాగార్జునసాగర్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా గడచిన 4 రోజులుగా 30000 క్యూసెక్కుల నీటిని తో పూర్తిస్థాయిలో,700 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ ఈ మల్లికార్జునరావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. కాగా నాగార్జున సాగర్ ప్రాజక్ట్ ద్వారా మంత్రులు 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువ కు వదిలిన తర్వాత అధికారులు 14 గేట్ల ద్వారా 10932 క్యూసెక్కుల నీరు వదిలారు.మంగళవారం సాయంత్రం వరకు 20 గేట్ల ద్వారా 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలనున్నట్లు- ప్రాజక్ట్ అధికారులు తెలిపారు. అనంతరం మంత్రులు, అధికారులు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ను సందర్శించి కృష్ణ జలాలకు పుష్పాభిషేకం చేశారు.

# కాళేశ్వరం నివేదిక సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించే అవకాశాలు ఉన్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చోటు-చేసుకున్న లోపాలు, వాటి ఆధారాలతో భారీ నివేదికను సిద్ధం చేశారు. కమిషన్‌కు ప్రభుత్వం ఇచ్చిన గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు నిధులు విడుదల చేసినట్లు- పీసీ ఘోష్ కమిషన్ గుర్తించింది. విచారణ సందర్భంగా ఐఏఎస్ అధికారులు చెప్పిన అంశాలపై ప్రత్యేక ప్రస్తావన చేసింది. ఐఏఎస్, ఇంజనీర్లకు సమన్వయ లోపం ఉన్నట్లు- కమిషన్ గుర్తించింది. నాటి ప్రభుత్వ పెద్దలు నేరుగా క్షేత్రస్థాయి సిబ్బందితో సంప్రదింపులు చేయడంతో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా పోయింది. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదు. పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే డిజైన్ల మార్పు చేసినట్లు- గుర్తించారు. డీపీఆర్ మార్పులు, మొదట్లో చెప్పిన డీపీఆర్, తర్వాత డీపీఆర్లో మార్పులు, నిధుల సేకరణ ఎలా జరిగిందో వివరించే అవకాశం ఉంది. హైలెవల్ కమిటీ- అనుమతి లేకుండానే బడ్జెట్ రిలీజ్ గుర్తించింది. మూడు బ్యారేజీలకు సంబంధించిన ఆర్థిక పరమైన అంశాలను వేరువేరుగా పొందుపర్చింది. అధికారుల తప్పిందం అంశాలపై లీగల్ అంశాలతో సిఫార్సు చేసింది. బహిరంగ విచారణ సందర్భంగా సాక్షులు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో అంశాలను చేర్చింది. గతేడాది జూన్ నుంచి జస్టిస్ ఘోష్ కమిషన్ ప్రత్యక్ష విచారణ చేపట్టింది. వందల అఫిడవిట్లు-, బహిరంగ విచారణలు, ఎన్డీఎస్ఏ, కాగ్ నివేదికలు, విజిలెన్స్, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో గత ప్రభుత్వం ఆమోదించిన మంత్రి మండలి మినిట్స్, ప్రభుత్వం సమర్పించిన వేల పేజీల సమాచారాన్ని కమిషన్ పూర్తిగా పరిశీలించింది. అన్నింటి నుంచి కీలక ఆధారాలను కమిషన్ సేకరించింది. మూడు బ్యారేజీల్లో చోటు-చేసుకున్న లోపాలు, వాటికి సంబంధించిన ఆధారాలతో నివేదికను సిద్ధం చేసిందని తెలుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌లు కమిషన్ విచారణకు హాజరైన విషయం తెలిసిందే.


# యూరియాపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా ఎంత యూరియా కావాలంటే అంత ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. రబీ సీజన్‌లో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని... కానీ తెలంగాణలో 12.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఇప్పుడు యూరియా లేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని.. రబీలో అదనంగా ఉన్న యూరియా ఇప్పుడు ఎందుకు లేకుండా పోయిందని.. ఎందుకు కొరత వచ్చిందో రేవంత్ ప్రభుత్వం పరిశీలించుకోవాలని సూచించారు. యూరియా విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావుకి రామచంద్ర రావు సవాల్ విసిరారు. ఆర్టీఏ చట్టం ద్వారా వివరాలు సేకరిద్దాం అని, తనది తప్పైతే రాజీనామా చేస్తానంటూ సవాల్ చేశారు. యూరియా సరఫరా విషయంలో ఆర్టీఏ చట్టం ద్వారా వివరాలు తీసుకోవచ్చుని, అందులో తాము చెప్పేది అబద్ధమైతే తాను రాజీనామాకు సిద్ధమని.. మరి తుమ్మల రాజీనామా చేస్తాడో చూడాలని రామచంద్ర రావు అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో రామచంద్రరావు పర్యటించారు.సీఎం రేవంత్ కుర్చీ కాపాడుకోవాడం కోసమే తన సమయాన్ని వెచ్చించాల్సి వస్తుందని, అందువల్లే మీనాక్షి నటరాజన్ పాదయాత్ర కూడా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇవ్వాలి, కానీ అందులో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించకూడదు. బీసీ బిల్లుకు బేషరతుగా మద్దతు ఇచ్చింది బీజేపీ మాత్రమే. 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాల్సిందే. ఒక్క శాతం తగ్గిన ఊరుకునేది లేదు' అని హెచ్చరించారు. 'మొన్న బండి సంజయ్ చెప్పాడు.. ఇది బీసీ రిజర్వేషన్ కాదు, ముస్లింల రిజర్వేషన్ అని. మేము ముస్లింలకు వ్యతిరేకం కాదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 19 నెలలు అవుతుంది. ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదు. కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద దేశంలో ప్రతి రైతుకు డబ్బులు పడ్డాయి. ఖమ్మంలో కూడా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. తెలంగాణ, ఖమ్మం జిల్లా ప్రజలు బీజేపీ మీద విశ్వాసంతో ఉన్నారు. ఖమ్మం జిల్లాలో గెలుపే లక్ష్యంగా అందరూ పని చేయాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు.

# మానవత్వం చాటుకున్న రాహుల్

**న్యూఢిల్లీ, (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి మానవత్వం చాటుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో పాకిస్తాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో తల్లిదండ్రులను కోల్పోయిన 22 మంది పిల్లలను దత్తత తీసుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేత నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, పహల్గాంలో ఏప్రిల్ 22న ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. దాడిలో 26 మంది టూరిస్టులు చనిపోయారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది.



# ఏఎన్ఎం.. ఆశ వర్కర్లు సమయపాలన పాటించాలి

● మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలి ● చెరువుల సమీప ప్రాంతాల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ● రైతులకు యూరియా అందించుటలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం కృషి చేయాలి

● పిల్లలతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, జులై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంగెం మండలం కాపుల కనపర్తి పి హెచ్ సి, గవిచెర్ల ఇందిరమ్మ ఇండ్లు, నెక్కొండ మండలం అప్పలరావు పేట్ ఊర చెరువు, వెంకటాపూర్ పెద్ద చెరువులను, నెక్కొండ జిల్లా పరిషత్ హై స్కూల్, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ తనిఖీలో డాక్టర్స్ ఏఎన్ఎం విధులకు ఆలస్యంగా రావడం పై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సిలో కాలం చెల్లిన మందులు ఉండడం పట్ల డాక్టర్ పై చర్యలు తీసుకోవ లసిందిగా డిఎం అండ్ హెచ్ ఓ సాంబశివరావు ను ఆదేశించారు. గవి చర్ల లో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఇందిరమ్మ యాప్ లో లబ్ధిదారుల ఇండ్లకు చెల్లించవలసిన రూపాయల మంజూరుకు విడతల వారిగా అప్లోడ్ చేసే ప్రక్రియ ను స్వయంగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లకు వినియోగించే గ్రావెల్, ఐరన్ ఇసుక, సిమెంట్ లేబర్, మేస్త్రి చార్జీలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలనే చెల్లించాలని జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు సూచించారు. నెక్కొండ మండలం అప్పలరావుపేట్ ఊర చెరువు, వెంకటాపూర్ పెద్ద చెరువు ప్రాంతాల్లో గతంలో ఆర్టీసీ బస్సు వరదలో చిక్కిన ప్రాంతాన్ని తనిఖీ చేశారు. చెరువుల చుట్టుప్రక్కన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 1800 425 3424 కు సంప్రదించాలని ప్రజలకు సూచించారు. అనంతరం నెక్కొండ జిల్లా పరిషత్ హై స్కూల్ లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆకస్మికంగా తనిఖి చేశారు. మెనూ ప్రకారంగా మధ్యాహ్న భోజనం తయారు చేయడం లేదని జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు కారణమైన ఇన్చార్జి టీచర్ పై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ మధ్యాహ్నం భోజనం చేశారు. 8, 9 ,10వ తరగతి విద్యార్థుల ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషల పాఠ్యాంశాలను విద్యార్థులచే చదివించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి టీచర్ కృషి చేయాలన్నారు. లైబ్రరీ ఏర్పాటు చేసి పుస్తకాల ను పిల్లలకి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రస్తుత టెక్నాలజీ ఆర్టిఫిసియల్ ఇంటెలిజెంట్ ద్వారా విద్యాబోధన అందించాలని ప్రధానోపాధ్యా యులు రంగారావు ను ఆదేశించారు. మిడ్ డే మీల్స్ లో ఉపయోగించే ఉప్పు కారం తదితరాలను క్వాలిటీ టెస్టింగ్ కి పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పిల్లలకి పౌష్టిక ఆహారం తో పాటునాణ్యమైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. టీచర్లు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల హెల్త్ గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య వివరాలు నమోదు చేసే హెల్త్ కార్డ్స్ లను ఇవ్వాలని డిఎంహెచ్ ఓకు సూచించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలను అలవాటు చేయడంలో వారంలో ఒక రోజు ఒక భాష మాట్లాడే విధంగా ప్రణాళికలు చేసినచో పిల్లలకు లాంగ్వేజ్ పైన పట్టు సాధించగలుగుతారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నెక్కొండ ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాన్ని తనిఖీ చేసి రైతులకు అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామి రెడ్డి , జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సాంబశివరావు, నెక్కొండ తహసిల్దార్ ఎంపీడీవో లు, నెక్కొండ ఎంఈఓ రత్నమాల తదితరులు ఉన్నారు.

# జాతీయ క్రీడాకారుడు శశాంక్‌ని పరామర్శించిన సోదా రామకృష్ణ




**పరకాల, జులై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల మున్సిపాలిటీ జవాన్ సూదమల్ల కిషోర్ కుమారుడు జాతీయ క్రీడాకారుడు సూదమల్ల శశాంక్ ప్రమాదవశాత్తు టూవీలర్ నుండి కింద పడిపోగా తలకు బలమైన గాయాలైనందున హన్మకొండలోని అజార్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న శశాంక్ ని పరామర్శించిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ. త్వరగా కోలుకుంటాడని కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని నింపారు.

# తెలంగాణ రాష్ట్రంలో ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణకు కేంద్రం సహకరించాలని లోక్ సభలో ప్రస్తావించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్, జులై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** PM e-DRIVE పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి 2,800 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు ప్రతిపాదనను ఆమోదించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్ ప్రశ్నించారు. ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పర్యావరణ రక్షణతో పాటు, తెలంగాణ రవాణా రంగానికి నూతన శక్తినిస్తాయని ఎంపీ పేర్కొన్నారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారి ప్రశ్నకు కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ స్పందిస్తూ, ప్రామాణిక GCC మోడల్‌ను మాత్రమే కేంద్రం ఆమోదిస్తోందని తెలిపారు. రాష్ట్రం సూచించిన హైబ్రిడ్ మోడల్ ప్రస్తుతం పథకంలో లేనందున, ఇంకా పరిశీలనలో ఉన్నదని చెప్పారు. ఈ సందర్భంగాఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. రాష్ట్రం తరపున మరిన్ని అంశాలు లేవనెత్తుతూ కేంద్రం రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా విధానాల్లో మార్పులు చేయాలని అభ్యర్థించా రు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం తరపున 2,800 ఎలక్ట్రిక్ బస్సుల ప్రతిపాదన కోరారు. హైబ్రిడ్ GCC మోడల్ ద్వారా ఉపాధికి మద్దతు కల్పించాలన్నారు. CESL ఆధ్వర్యంలో బస్సుల కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రభుత్వ ఖజానాకు నష్టం చేస్తూ బోగస్ వాహన రిజిస్ట్రేషన్, ఇన్సురెన్స్ సర్టిఫికేట్ల తయారీ ముఠా అరెస్టు




**హన్మకొండ, జులై 29(పిసిడబ్ల్యు న్యూస్):**

రెండు వేర్వేరు సంఘటనల్లో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తూ బోగస్ వాహన రిజిస్ట్రేషన్, ఇన్సురెన్స్ సర్టిఫికేట్లను తయారీ చేసున్న రెండు ముఠాలకు సంబంధించి 15 మందిని కేటుగాళ్ళను టాస్క్ ఫోర్స్, హన్మకొండ, మీల్స్ కాలనీ, కెయూసి పోలీసులు ఆర్.టి.ఏ అధికారులతో సంయుక్తంగా కలిసి అరెస్టు చేయగా మరో ఐదుగురు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు. పట్టుబడిన నిందితుల నుండి పోలీసులు 6 డెస్క్ టాప్ కంప్యూటర్లు, 2 ల్యాప్ టాప్లు, 2 థర్మల్ ప్రింటర్స్, 17 సెల్ ఫోన్ల తో పాటు కంప్యూటర్ చిప్ తో కూడిన పివిసి కార్డులు, కార్డు ప్రింటింగ్ కు అవసరమైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో 1. యం.డి ఆసిఫ్ ఖురేషి (46), హన్మకొండ, 2. వడ్లకొండ శ్రీనివాస్ (46) హన్మకొండ, 3. యం.డి నవాబ్ (60), లెబర్ కాలనీ, వరంగల్, 4. యం.డి సాబీర్ (44), ఎల్.బి నగర్, 5. మణికంటి ప్రభాకర్ రెడ్డి(50), నయీంనగర్, హన్మకొండ, 6. గుగ్గిళ్ళ చెర్రిబాబు (50), కాపువాడ, హన్మకొండ, 7. కెషోజు రాజ్కుమార్ అలియాస్ డి.ఎల్ రాజు (49), గుడిబండల్, హన్మకొండ, 8. యం.డి ఆసిఫ్ (29), కరుణాపురం, ధర్మసాగర్, 9. అంకం శ్రీనివాస్ (50), ధర్మసాగర్, 10. గొనెల రమేష్ అలియాస్ వాగ్దేవి రమేష్ (41), సుధానగర్, హన్మకొండ, 11. ఎన్. శశివర్ధన్ (31), ఫోర్టు వరంగల్, వరంగల్, 12. నరిశెట్టి రాజేష్ (37), కరీమాబాద్, వరంగల్, 13.తండ దిలివ్ కుమార్ (29), శాయంపేట హవేలి, గీసుగొండ, 14. ముజ్జిగ ఓంప్రకాశ్ (31), నక్కలపెల్లి, వరంగల్, 15. ముషిపట్ల అక్షయ్ కుమార్ (29), ఫాతీమానగర్, కాజీపేటకు చెందిన వారిగా గుర్తించడం జరిగింది. ప్రస్తుతం పరారీలో వున్న నిందితులు లక్ష్మమ్మ, సతీష్, వేల్పుల ప్రశాంత్, దేవులపల్లి శ్రావణ్, మామిడి రాజు ఏ భూపాలపల్లి రాజు వున్నారు. పట్టుబడిన నిందితుల్లో అధికశాతం ఆర్.టి.ఓ బ్రోకర్లు మరియు వాహన కన్సల్టెన్సీ యజమానులు వున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా వివరాలను వెల్లడిస్తూ ఈ రెండు కేసులకు సంబంధించి హన్మకొండ పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు ప్రధాన నిందితులైన ఎమ్.డి. ఆసిఫ్ ఖురేషి, వడ్లకొండ శ్రీనివాస్ లు ఆర్.టి.ఏ ఏజెంట్లుగా చెలామణి అవుతున్నారు. ఫైనాన్స్ ద్వారా వాహనాలు కొనుగోలు చేసిన వాటి వాయిదాలు తిరిగి చెల్లించని పక్షంలో ఫైనాన్స్ సంస్థలు స్వాదీనం చేసుకున్న వాహనాలను సదరు వాహన ఫైనాన్స్ సంస్థలు తిరిగి విక్రయించే సమయంలో తప్పనిసరిగా ప్రేష్ రిజిస్ట్రేషన్ కార్డు కొసం ఆర్.టి.ఓ కార్యాలయానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది. కాని వాహన ఫైనాన్స్ సంస్థలు అలా చేయకుండా స్వాధీనం చేసుకున్న వాహనాలను నేరుగా స్థానికంగా వున్న వాహన కన్సల్టెన్సీ వ్యాపారస్తులకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లతో పాటు ఓరిజినల్ వాహన రిజిస్ట్రేన్ కార్డు లేకుండా వాహనాన్ని విక్రయించేవారు. దీనితో వాహన కన్సల్టెన్సీ వ్యాపారస్తులు వాహనాలను విక్రయించేందుకుగాను అవసరమైన ఒరిజినల్ రిజిస్ట్రేషన్ పత్రాల కొసం ప్రధాన నిందితులను సంప్రదించేవారు. దీనితో నిందితులు కన్సల్టెన్సీ ద్వారా విక్రయించే వాహనాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్లైన్ ద్వారా సేకరించి, ఆన్లైన్ లో కొనుగోలు చేసిన పి.వి.సి. కార్డ్ లపై మరియు ఆర్.టి.ఓ కార్యాలయముల నుండి అక్రమంగా వివిధ మార్గాల్లో సేకరించిన ఓరిజినల్ కార్డులపై థర్మల్ ప్రింటింగ్ మిషన్ ద్వారా ఒరిజినల్ తరహాలో రిజిస్ట్రేషన్ కార్డులను తయారు చేసి కన్సలటెన్సీ వ్యాపారస్తులకు అందించడంతో కన్సల్టెన్సీ వ్యాపారస్తులు వాహన ఫైనాన్స్ సంస్థల నుండి కొనుగొలు వాహనాలను ప్రజలకు విక్రయిస్తూ బోగస్ రిజిస్ట్రేషన్ పత్రాలను ఉపయోగించి ఆన్లైన్ లో ఫ్రెష్ రిజిస్ట్రేషన్ లను ఆర్.టి.ఏ నుండి జారీ చేయిస్తున్నారు. మరో సంఘటనలో కె.యూ.సి మరియు మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు అరెస్టు చేసిన నిందితులందురు ఆర్.టి.ఏ బ్రోకర్లుగా పనిచేస్తూ ఫిట్నెస్ సర్టిఫికేట్ రెన్యూవల్ అవసరం ఉన్న వాహనాలకు మరియు ఓనర్ షిప్ ట్రాన్సర్ సమయంలో ఆర్.టి.ఏ నిబంధనల ప్రకారం వాహన భీమ పత్రాలు తప్పనిసరి కావున దానిని ఆసరాగా చేసుకొని, అవసరమైన భీమా పత్రాల కొసం ఈ ముఠా సభ్యులు ముందుగా ఒక ఓరిజినల్ భీమా పాలసీని తీసుకొని, వారికి వున్న పరిజ్ఞానంతో పాలసీపై ఉన్న వివరాలను మార్చి వాటి స్థానంలో వారికి కావల్సిన వాహన వివరాలు, కావాల్సిన పాలసీ గడువు తేదీలతో కూడిన బోగస్ వాహన పాలసీలను రూపోందించేవారు. ఈ విధంగా రూపొందించిన భీమా పత్రాలను ఆర్.టి.ఓ కార్యాలయానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసి ఫిటెనెస్ రెన్యూవల్ సర్టిఫికెట్ పొందే విధంగా నిందితులు వాహన దారులకు సహకరిస్తూ వారి వద్ద నిందితులు పెద్ద మొత్తంలో డబ్బు వసూళ్ళకు పాల్పడేవారు. రెండు వేర్వురు సంఘటనల్లో హన్మకొండ పోలీసులు ఆరుగురుని అరెస్టు చేయగా, మీల్స్ కాలనీ పోలీసులు ఆరుగురుని, కెయూసి పోలీసులు మరో ముగ్గురుని అరెస్టు చేసారు. ఈ రెండు సంఘటనల్లో నిందితులు బోగస్ రిజిస్ట్రేషన్ కార్డ్స్, బోగస్ భీమా పత్రాలను అందజేయడం ద్వారా పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగింది. అలాగే ఆర్.టి.ఓ విభాగానికి సంబంధించి ఎవరైన ఉద్యోగులు నిందితులకు సహకరించారనే కోణంపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లుగా సెంట్రల్ జోన్ డిసిపి వెల్లడించారు. నిందితులను పట్టు కొవడంలో ప్రతిభ కనబరిచన వరంగల్ ఏసిపి శుభంప్రకాశ్, హన్మకొండ ఏసిపి నర్సింహరావు, టాస్క్‌ఫోర్స్ ఏసిపి మధుసూధన్, ఇన్స్‌స్పెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, శ్రీధర్, బాబులాల్, పవన్ కుమార్,కెయూసి, మిల్స్ కాలనీ, హన్మకొండ ఇన్స్‌స్పెక్టర్లు రవికుమార్, రమేష్, శివకుమార్ తో పాటు, టాస్క్‌ఫోర్స్, కెయూసి, మిల్స్ కాలనీ, హన్మకొండ పోలీస్ స్టేషన్లకు చెందిన ఎస్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బందిని సెంట్రల్ జోన్ డిసిపి అభినందించారు.

# 31వ తేది నుండి రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ప్రారంభం

● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




**వరంగల్, జులై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** కమిషనరేట్ పోలీసుల అధ్వర్యంలో ఈ నెల 31వ తేది నుండి మూడురోజుల పాటు తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ 2025 నిర్వహిస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రకటించారు. మామూనూర్ పి.టి.సి వేదికగా నిర్వహిస్తున్న ఈ రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లకు తెలంగాణ రాష్ట్రంలోని ఏడు పోలీస్ చేందిన జోన్లతో పాటు సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్లు, సిఐడి ఇంతెలిజెన్స్,యాంటీ నార్కోటిక్ బ్యూరో,సైబర్ సెక్యూరిటీ వింగ్ విభాగాలకు చెందిన సూమారు వెయ్యికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది సైటిఫిక్ ఎయిడ్, యాంటీ సబటేజ్ చెక్,కంప్యూటర్,డాగ్ స్క్వాడ్, ప్రోపెషనల్ ఫోటో గ్రాఫీ, వీడియో గ్రఫీలకు సంబంధించిన 25 విభాగాల్లో పోటీ పడుతారు. ఈ పోటీలను 31తేదిన ఉదయం 9గంటలకు రాష్ట్ర స్థాయి పోలీస్ ఉన్నతాధికారి చేతుల మీదుగా ఈ రాష్ట్ర స్థాయి డ్యూటీ పోటీలను ప్రారంభించబడుతుందని. అలగే ఆగస్టు 2వ తేదిన ఈ పోటీల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు ముఖ్య అతిధిల చేతుల మీదుల విజేతలకు పతకాలను అందజేయడంతో పాటు, ఛాంఫియన్ షీప్ ట్రోఫీలను అందజేయడం జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడిరచారు.

# ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తాం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**చిట్యాల, జులై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రాథమిక పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే.సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు, ప్రతీ విద్యార్థి సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. చిట్యాల మండలం శాంతినగర్ గ్రామంలో కొత్తగా గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొంతకాలంలోనే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం చిన్నారులకు ఎమ్మెల్యే అక్షరాభ్యాసం చేయిస్తూ ఉపాధ్యాయుడిలా మారి సందడి చేశారు.





# ఘనంగా నాగుల పంచమి వేడుకలు

### - కాంగ్రెస్ ఇంచార్జ్ ప్రణవ్ ప్రత్యేక పూజలు



**హుజురాబాద్, జూలై 29: (పిసిడబ్ల్యూ న్యూస్):**నాగుల పంచమి పర్వదినాన్ని పురస్క రించుకుని హుజురాబాద్ పట్టణంలోని కొత్తపల్లి శ్రీ నాగేంద్ర స్వామి దేవాలయం లో మంగళ వారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ పాల్గొని స్వామివారికి విశేష పూజలు చేశారు.అనంతరం వొడితల ప్రణవ్ మాట్లాడుతూ, శ్రీ నాగేంద్ర స్వామి దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, పాడి పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

# ఘనంగా నాగుల పంచమి పూజలు





**గంగాధర, జూలై 29(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ లో నాగుల పంచమి పర్వదినము సందర్భంగా హనుమాన్ దేవాలయము దగ్గర నాగేంద్ర స్వామి పుట్టకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పసుపు, కుంకుమ, పాలు, పువ్వులు, పండ్లు, స్వీట్, జొన్న పేలాలు తో ప్రత్యేక పూజలు నిర్వహించినారు నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టలో పాలు పోసి పూజలు ఘనంగా జరుపుకున్నారు.

# వివిధ గ్రామాలలో మంచినీటి బోర్ల ప్రారంభోత్సవం




**గంగాధర, జూలై 29 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ సహకారంతో గంగాధర మండలం మంగపేట,గోపాల్ రావు పల్లి గ్రామంలో ఈరోజు తాగునీటి అవసరాల కోసం మంచినీటి బోర్ ప్రారంభోత్సవం చేయడం జరుగుతుంది.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్, మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్,మండల ఉపాధ్యక్షులు గుండెల్లి మల్లేశం,జిల్లా బిజెపి నాయకులు పెంచాల రాములు,మాజీ ఉపసర్పంచ్ కార్తీక్,బైరి ప్రభాకర్ రెడ్డి, సుధాకర్,బీజేవైఎం నాయకులు సుంకరి అనిల్, గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

# పారుపల్లిలో కేహెచ్చ్ఆర్ పుట్టినరోజు వేడుకలు

**యాదాద్రి జులై 29 (పీసీడబ్ల్యూ న్యూస్):**యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పారుపల్లిలో మంగళవారం రోజున బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పేదల పెన్నిధి కే హెచ్ ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి జన్మదినం సందర్భంగా పారుపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా పుట్టినరోజు సంబరాలు నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం:ప్రణవ్

### • కౌశిక్ రెడ్డిపై ప్రణవ్ విమర్శలు.. అభివృద్ధిపై కాంగ్రెస్ దృష్టి





**హుజురాబాద్, జూలై 29: (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి పనులపైనే తమ దృష్టి ఉందని హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్ స్పష్టం చేశారు. కౌశిక్ రెడ్డి చిల్లర రాజకీయాలపై దృష్టి సారించారని, కేసీఆర్, కేటీఆర్ మెప్పు కోసమే ఇదంతా చేస్తున్నారని ఆయన విమర్శించారు. మంగళవారం హుజురాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ప్రణవ్ మాట్లాడారు. **అభివృద్ధికి రూ. 10 కోట్లు- విద్య, వైద్యానికి ప్రాధాన్యం** ప్రభుత్వం వచ్చాక ఎస్డీఎఫ్ నిధుల కింద పది కోట్ల రూపాయలు మంజూరు చేసి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ప్రణవ్ తెలిపారు. గత 18 నెలల్లో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని, ఐదు పాఠశాలలకు రూ. 1.13 కోట్లు, నీటి సమస్యకు రూ. 1 కోటి వెచ్చించామని వివరించారు. కౌశిక్ రెడ్డి గతంలో ఏమీ చేయలేక ఇప్పుడు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కుల సంఘాలు, మహిళా భవనాలు, ఆంజనేయస్వామి ఆలయ ప్రహరీ, రూ. 20 లక్షల కమ్యూనిటీ హాలు పనులు త్వరలో చేపడతామని ప్రణవ్ ప్రకటించారు. **విద్యాభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడిబీ సొంత భవనాలతో ఎంజేపీ పాఠశాలలు** కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఎంజేపీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని ప్రణవ్ పేర్కొన్నారు. ఆయా మండలాల్లో సొంత భవనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, డైట్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచామని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేయలేని పనులను కాంగ్రెస్ 18 నెలల్లో చేసి చూపించిందని, రేషన్ కార్డులు, సన్న బియ్యం, మహిళలకు ఉచిత రవాణా వంటి పథకాలు తీసుకొచ్చిందని గుర్తుచేశారు. త్వరలో హుజురాబాద్‌కు ఇంటిగ్రేటెడ్ పాఠశాల రానుందని ప్రకటించారు. **ఆరు గ్యారెంటీలు అమలుపై బీఆర్ఎస్‌కు ప్రణవ్ కౌంటర్** ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ప్రణవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత బస్సు ద్వారా కోటి 30 లక్షల టిక్కెట్లు మహిళలకు ఇవ్వగా రూ. 52 కోట్లు ఆదా అయ్యాయని తెలిపారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేశామని, తొమ్మిది రోజుల్లో రూ. 9,000 కోట్లు రైతు భరోసా ఇచ్చామని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేసిన అప్పులకు నెలకు రూ. 5-6 వేల కోట్ల వడ్డీ కడుతున్నా, సంక్షేమ పథకాలు ఆపడం లేదన్నారు. **ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులు బీఆర్ఎస్ నాయకులే: ప్రణవ్** ముఖ్యమంత్రిపై ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ప్రణవ్ మండిపడ్డారు. ఫోన్ హ్యాకింగ్ దేశంలోనే మొదట బీఆర్ఎస్ పార్టీనే చేసిందని, ఇది ఆధారాలతో సహా రుజువైందని గుర్తుచేశారు. కౌశిక్ రెడ్డి తన నాయకుల మెప్పు కోసమే ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, సీఎంని విమర్శించే స్థాయి కౌశిక్ రెడ్డికి లేదని అన్నారు. రేవంత్ రెడ్డి దమ్మేంటో అసెంబ్లీ ఎన్నికల్లోనే చూపించారని, బీఆర్ఎస్ పాలనలో కూడా ఆయన్ను ఏమీ చేయలేకపోయారని ప్రణవ్ ఎద్దేవా చేశారు. **బీజేపీ, బీఆర్ఎస్ కలయికపై ప్రణవ్ ప్రశ్నలు** బీజేపీ ఎంపీ సీఎం రమేష్ బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారని చెప్పడంతో కేటీఆర్ కలవరపడుతున్నారని ప్రణవ్ అన్నారు. బీజేపీ ఎంపీ ఇంటికి కేటీఆర్ ఎందుకు వెళ్ళాడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్వార్థం కోసం పార్టీ విలీనానికి వెనకాడని కేటీఆర్ రాష్ట్ర ప్రయోజనాలను ఏం కాపాడుతారని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చిన, అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ పార్టీయే రాష్ట్రానికి తోడ్పడుతుందని ప్రణవ్ ధీమా వ్యక్తం చేశారు.

## ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంపై కౌశిక్ రెడ్డి ధ్వజం:

# తక్షణ సస్పెన్షన్‌కు డిమాండ్



**హుజురాబాద్, జూలై 29, (పిసిడబ్ల్యూ న్యూస్):**హుజురాబాద్‌లోని సైదాపూర్ ఎం.జె.పి. గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కొరికిన ఘటనపై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ నిమిత్తం పాఠశాలను సందర్శించిన ఆయన, ప్రిన్సిపాల్ రాణిపై మండిపడ్డారు.విద్యార్థుల భద్రత విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ, పాఠశాలలో పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. “మీ సొంత పిల్లలను ఎలుకలు కొరికితే ఇలాగే ఉంటారా?” అంటూ ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. విద్యార్థులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్న ఎమ్మెల్యే, ఈ పరిణామం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.**ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి విమర్శలు** గురుకుల పాఠశాలల స్థితిగతులు: కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గురుకుల పాఠశాలలు ఎలా ఉన్నాయో, ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలు గమనిస్తున్నారని కౌశిక్ రెడ్డి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో గురుకులాల్లో 100 మందికి పైగా విద్యార్థులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఒక్కో విద్యార్థిపై రూ.1,25,000 వెచ్చించి వారి భవిష్యత్తుకు బాటలు వేశారని గుర్తు చేశారు.విద్యాశాఖ మంత్రిత్వ శాఖపై ఆరోపణలు: విద్యాశాఖ మంత్రి పదవి ముఖ్యమంత్రి చేతిలో పెట్టుకొని విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన వారికి లక్ష రూపాయల భోజనం పెట్టిన ప్రభుత్వం, విద్యార్థుల విషయంలో ఇంత కక్ష సాధింపు ఎందుకని ప్రశ్నించారు.**తక్షణ సస్పెన్షన్ డిమాండ్** విద్యార్థులను ఎలుకలు కొరికిన ఘటనలో బాధ్యతారహితంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ రాణిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అధైర్యపడవద్దని, బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ వారికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఘనంగా నాగ పంచమి వేడుకలు...

### • శ్రీ సంతాన నాగేంద్ర స్వామి దేవాలయానికి అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు..





**అలుగునూర్,జూలై29(పీసీడబ్ల్యూ జ్యూస్):** తిమ్మాపూర్ మండలం అలుగునూర్ లోని శ్రీ వెంకటేశ్వర కాలనీ లో స్థానిక దేవాలయ కమిటీ అధ్యక్షులు చిందం నరసయ్య ఆధ్వర్యంలో నాగ పంచమి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నాగ పంచమి పండుగ సందర్భంగా కాలనీలోని శ్రీ సంతాన నాగేంద్ర స్వామి దేవాలయానికి భక్తులు, మహిళలు, వివిధ ప్రాంతాల నుండి త అశేష సంఖ్యలో ప్రజలు తరలివచ్చి పుట్టలో పాలు పోసి నాగదేవతలను పూజించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షులు చిందం నరసయ్య మాట్లాడుతూ హిందూ ధార్మిక ఆచారంలో నాగదేవత పూజ అనేది ఎంతో విశిష్టమైనదని తెలిపారు. నాగదేవతలను పూజించడం వల్ల సర్పభయాలు తొలగిపోతాయని, కుటుంబ శ్రేయస్సు , సంతాన భాగ్యం కలుగుతుందని శ్రీ సంతాన నాగేంద్ర స్వామి దేవాలయానికి వచ్చే భక్తుల ప్రగాఢ విశ్వాసం అన్నారు.

# కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాలని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి డిమాండ్



**హుజురాబాద్, జూలై 29, (పిసిడబ్ల్యూ న్యూస్):** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఆరు గ్యారంటీలలో భాగంగా వివాహం చేసుకున్న వారికి ఇస్తానన్న తులం బంగారం కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మంగళవారం హుజురాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, గత ముఖ్యమంత్రి కేసీఆర్ పేద కుటుంబాల వివాహాల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో మందికి ఆసరాగా నిలిచిందని గుర్తు చేశారు.అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో కళ్యాణ లక్ష్మి పథకం కింద లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేల పెళ్లిళ్లు జరిగినా వారికి తులం బంగారం ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేయాలని కౌశిక్ రెడ్డి అన్నారు.అనంతరం, అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఇల్లంతకుంటకు చెందిన 34 కళ్యాణ లక్ష్మి చెక్కులు, హుజురాబాద్ టౌన్‌కు చెందిన 19 చెక్కులు కలిపి సుమారు 53.06 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అలాగే, కమలాపూర్‌కు ?12 లక్షల విలువైన 49 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల కోసం నేరుగా సంప్రదించండి

### • సిబ్బంది లంచం అడిగితే చర్యలు తీసుకుంటాం




**గంగాధర, జూలై 29 (పీసీడబ్ల్యు న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం మండలం ప్రజలు తమ సమస్యలను నేరుగా తనను సంప్రదించి పరిష్కరించుకోవాలని గంగాధర మండల తహసిల్దార్ అనుపమ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం పై ఫిర్యాదులు అందడంపై మీడియా తో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా తాను అందరికీ అందుబాటులో ఉంటున్నానని అన్నారు. భూభారతకి సంబంధించి సమస్యలు ఉంటే పై అధికారుల సూచనల మేరకు వెంటనే పరిష్కరిస్తున్నామని అన్నారు. వ్యక్తి కి సంబంధించిన భూములను పరిష్కరించుకోవాలంటే సరైన ఆధారాలు, డాక్యూమెంట్ లు ఉంటే పరిష్కరిస్తామన్నారు. కింది స్థాయి ఉద్యోగులు ఎలాంటి ప్రలోభాలకు పాల్పడిన తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటామని అన్నారు. అన్ని భూ సంబంధిత సమస్యలకు తగిన డాక్యూమెంట్ లు వివరణలు ఉండాలని అన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి 21వ మహా పాదయాత్రకు ఘన ప్రారంభం

**● శ్రీ గండమ్మ తల్లి దేవాలయంలో పూజలు చేసి సన్మానించిన కాట సుధా శ్రీనివాస్ గౌడ్**




**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్‌చెరు మహంకాళి దేవాలయం నుండి తిరుమల–తిరుపతి వరకు శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య దర్శనం కోసం సీసాల రాజు ఆధ్వర్యంలో 21వ మహా పాదయాత్ర ప్రారంభమైంది. రామచంద్రాపురంలోని శ్రీ శ్రీ శ్రీ గండమ్మ తల్లి దేవాలయం వద్ద పాదయాత్ర బృందాన్ని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఘనంగా సన్మానించారు.అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తి శ్రద్ధలతో సాగనున్న ఈ పాదయాత్ర విజయవంతంగా పూర్తి కావాలని కోరుకున్నారు.

# మా కుమార్తె వివాహానికి తప్పకుండా హాజరుకండి

**● ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని ఆహ్వానించిన నిర్మల జగ్గారెడ్డి.**



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి,టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డిల కూతురు వివాహానికి హాజరవ్వాలని ఆహ్వానించారు. ఆగస్టు 7వ తేదీన సంగారెడ్డి లోని రామ మందిరంలో నిర్వహించనున్న తమ కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరుతూ పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి సతీమణి నిర్మలా జగ్గారెడ్డి ఆహ్వానించారు.ఈ మేరకు పటాన్ చెరువు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగ్గారెడ్డి సతీమణి శ్రీమతి తూర్పు నిర్మల జయప్రకాశ్ రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు.

# పటాన్ చెరువులో నూతన రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్




**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):**సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణాలు,డివిజన్లకు సంబంధించిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేసిన పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి. పటాన్చెరు వ్యాప్తంగా 2096 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు మంజూర య్యాయని తెలిపారు. నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# తిరుమలకు వైభవంగా ప్రారంభమైన మహా పాదయాత్ర

**● పటాన్చెరు పట్టణం నుండి తిరుమలకి సీసాల రాజు ఆధ్వర్యంలో ప్రారంభమైన 21వ మహాపాదయాత్రలో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్ ● దైవచింతనతో కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి చెంతకు 20సార్లు పాదయాత్ర పూర్తి చేశారు ● నేడు 21వ సారి ప్రారంభించడం గొప్ప విషయం**





**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):**మంగళవారం సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు పట్టణం మహంకాళి ఆలయం నుండి తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వద్దకు సీసాల రాజు గారి ఆధ్వర్యంలో చేపట్టిన 21వ మహాపాదయాత్రలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన సీసాల రాజుని,వారి మిత్రబృందాన్ని ఘనంగా సత్కరించి పాదయాత్ర దిగ్విజయంగా పూర్తిచేయాలని ఆకాంక్షించి కాసేపు వారి వెంట నడిచారు, ప్రతి ఏడాది దైవచింతనతో చేపట్టే పాదయాత్ర మంచి పరిణామం అని నీలం మధు ముదిరాజ్ అన్నారు, స్వామివారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బిచ్చగాళ్ల వీర్యంతో పిల్లలు లేని వారికి సంతానం కల్పిస్తున్న స్పెర్మ్ క్లినిక్‌లు

**● డాక్టర్ నమ్రత కేసులో విస్తుపోయే నిజాలు**



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):**బిచ్చగాళ్లకు బిర్యాని, అడ్డకూలీలకు మద్యం, చదువుకున్న వారికైతే రూ. వెయ్యి నుంచి 4 వేలు, అదే మహిళలకైతే రూ.20 వేల నుంచి రూ.25 వేల దాకా ఇచ్చి వీర్యం, అండాల సేకరణ పేరుతో దందా చేస్తున్న డాక్టర్ నమ్రత.ఇండియన్ స్పెర్మ్ టెక్ క్రయోసిస్టమ్ క్లినిక్ పేరుతో.. సికింద్రాబాద్‌లో దందా నడుపుతున్న డాక్టర్ నమ్రత.డాక్టర్ నమ్రతతో సహ ఏడుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు. దాతల నుంచి వీర్యం, అండాలు కోరుకునేవారు.ఆ దాతలు బాగా చదువుకున్నవారై, తెలివితేటలు కలిగినవారై ఉండాలని భావిస్తారు.కానీ.. ఈ దందా నడిపేవారు వారికి అంటగడుతున్నది బిచ్చగాళ్లు, అడ్డాకూలీల వీర్యాన్ని, అండాలను. పోర్న్ వీడియోలు చూపించి వీర్యం సేకరిస్తున్నట్లు సేకరించిన ఆధారాలు. నిబంధనల ప్రకారం ఆరోగ్యవంతులైన వ్యక్తులు,21 నుంచి 55 ఏళ్లలోపు ఉన్నవారి నుంచి వారికి అన్నిరకాల వైద్యపరీక్షలూ నిర్వహించి,ఎలాంటి జన్యవ్యాధులు, అంటువ్యాధులు లేవని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే వీర్యం సేకరించాలి.ఒక దాత నుంచి 25సార్లు మాత్రమే వీర్యాన్ని సేకరించడం. ఒక దాత నుంచి తీసుకున్న వీర్యాన్ని ఒక మహిళకు ఒకసారి గర్భధారణకు మాత్రమే ఉపయోగించాలి. కానీ ఈ నిబంధనలన్నింటినీ పక్కన పెట్టి ఒకే వ్యక్తి నుంచి వారానికొకసారి చొప్పున వీర్యం సేకరిస్తున్న స్పెర్మ్ క్లినిక్ లు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తబృందం ఆధ్వర్యంలో జరిగిన 21వ మహా పాదయాత్ర

**● తిరుమల యాత్రకు బయలుదేరిన భక్తులందరికీ హార్దిక శుభాకాంక్షలు తెలిపిన మాణిక్ యాదవ్**



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):**సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం నుంచి ప్రతి సంవత్సరం నిర్వహించే మహాపాదయాత్ర ను ప్రారంభించిన అమీన్ పూర్ బి ఆర్ ఎస్ యువ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పవిత్ర యాత్రలో ప్రతి ఒక్కరి అడుగడుగునా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అనుగ్రహం ఉండాలని, ఎటువంటి ఆటంకం లేకుండా ఈ పాదయాత్ర విజయవంతంగా పూర్తి కావాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.ఇది కేవలం శారీరక ప్రయాణం మాత్రమే కాకుండా, ఆధ్యాత్మికంగా మనల్ని లోనికి తీసుకెళ్లే పవిత్ర దారిగా భావిస్తున్నాను.ఈ యాత్రలో నాకు భాగస్వామ్యం కల్పించిన పూజ్యులైన పెద్దలకు, యాత్రను ఆరంభించి శ్రద్ధతో ముందుకు నడిపిస్తున్న భక్తసమూహానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.ఈ యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి స్వామివారి కటాక్షం కలగాలని, వారి కుటుంబాలపై భగవంతుని కృప ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

# మరణించిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్

**● బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి, జిన్నారం వెంకటేష్ గౌడ్**



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):**సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం జిన్నారం మండలం జిన్నారం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సింహా రెడ్డి తల్లి అనారోగ్యం తో నిన్న మరణించడం జరిగింది. వారి కుటుంబాన్ని, జిన్నారం మంగలి శ్రీనును ఎద్దు పొడిస్తే సోమవారం మరణించడం జరిగింది. ఈ వార్త తెలువగానే గోవర్ధన్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు.శివనగర్ మాజీ సర్పంచ్ రేఖ కృష్ణ వాళ్ళ అమ్మ అనారోగ్యం బాగాలేక సోమవారం రాత్రి చనిపోవడం జరిగింది వారి కుటుంబాన్ని బి ఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించి కృష్ణ కుటుంబనికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమం లో మం డల పార్టీ అధ్యక్షులు రాజేష్, శివ రాజ్, సురేందర్, నరేందర్, జనార్దన్, ప్రభాకర్ రెడ్డి, బోజి రెడ్డి, మోహన్, రమేష్, శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణ, శ్రీకాంత్ గౌడ్,భీమ్ రావు, శ్రీనివాస్, శాంతవర్మ రెడ్డి, భ్రమేందర్ గౌడ్,డి మహేష్,నర్సింలు, సూర్యనారాయణ, నిఖిల్ గౌడ్, సాయి కిరణ్ తదితరులు హాజరైనారు.




# పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి భక్త బృందం వారి మహా పాదయాత్ర

**● సీసాల రాజు ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే తిరుమల తిరుపతి మహా పాదయాత్ర**

**● 21వ మహపాదయాత్ర ఈ రోజు ప్రారంభించిన మెట్టు ఎల్లేష్ యాదవ్.**




**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):**డివిజన్ పరిధిలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ సహోదరుడు ఎల్లేష్ యాదవ్ సీసాల రాజుని పూల మాల వేసి,శాలువాతో సన్మానించి యాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ సీసాల రాజు గత 20 సంవత్సరాలుగా ప్రతీ ఏటా పటాన్ చెరువు నుండి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు కాలినడకన మహపాదయాత్ర నిర్వహిస్తున్నారని అన్నారు.ఇన్ని సంవత్సరాలుగా నిరాటంకంగా పాదయాత్ర నిర్వహించడం సామాన్యమైన విషయం కాదని, చాలా గొప్పవిషయమని ఆయనను కొనియాడారు.ఆ వెంకటేశ్వర స్వామి వారే రాజుకి, వారి బృందానికి ఆ శక్తిని ప్రసాదిస్తున్నారని అన్నారు.21వ సంవత్సరపు ఈ మహపాదయాత్ర క్షేమంగా,ఏ ఇబ్బంది లేకుండా జరగాలని ఆ వెంకటేశ్వర స్వామి వారిని ప్రార్థిస్తున్నానని అన్నారు.

# రాకేష్ రెడ్డిని కలిసిన బిఆర్ఎస్ నాయకులు



**హన్మకొండ జులై 29(పిసిడబ్ల్యు న్యూస్):** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డిని 55 డివిజన్ బిఆర్ఎస్ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డికి యూత్ నాయకులు పూల మొక్కను అందజేసి శాలువాతో సన్మానించారు. రాకేష్ రెడ్డి ని కలిసిన వారిలో జిల్లా యూత్ నాయకులు నమిండ్ల అరుణ్, జక్కుల శాంతన్ యాదవ్, గుగులోతు కళ్యాణ్ నాయక్, కావాటి చరణ్, బూర రోషన్ గౌడ్, జెల్ల రాజు తదితరులు ఉన్నారు.

# తాత్కాలిక కాంట్రాక్టు పద్ధతిలో పోస్టులకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు




**కొత్తపల్లి, జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ వైద్య విద్య సంచాలకులు, హైదరాబాద్ వారి అనుమతితో, తాత్కాలికవాక్–ఇన్ ఇంటర్వ్యూలు కాంట్రాక్టు పద్ధతిలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సిఎఎస్ (ఐసియూ) స్పెషలిస్ట్, మరియు సీనియర్ రెసిడెంట్ పోస్టులను భర్తీ చేయుటకు వాక్–ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించబడును. (https://www.gmcknr. com/gmcknr.html www.gmcknr.com) నుండి అప్లికేషన్ ఫారం డౌన్లోడ్ చేసుకొని, పూర్తి వివరాలు పూరించి, 01–08–2025 ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 03:00 గంటల వరకు, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికేట్లు,రెండు (02) సెట్ల నకలు ప్రతులతో ప్రభుత్వ వైద్య కళాశాల, కొత్తపల్లి, కరీంనగర్ నందు జరిగే వాక్–ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావలసిందిగా కోరడమైనది.ఈ నోటిఫికేషన్ కు సంబంధించిన పూర్తి వివరాలు 30–07–2025 సాయంత్రం నుండి కాలేజీ వెబ్సైట్లో అందుబాటులో ఉంచబడు ను. ఇట్టి నియామకాలు మెరిట్ మరియు రిజర్వేషన్ నియమా వళి (రూల్ ఆఫ్ రిజర్వేషన్) ప్రకారం నిర్వహించబడును. అభ్యర్థులు నోటిఫికేషన్కు సంబంధించిన తాజా అప్డేట్ల కోసం కాలేజ్ వెబ్సైట్ను క్రమం తప్పకుండా సందర్శించవలసిందిగా కోరడమైనదని కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

# సిరోల్, మరిపెడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ

## జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రాంనాథ్ కేకాన్







**మహబూబాబాద్ జిల్లా జూలై 29(పి.సి.డబ్ల్యూ న్యూస్):** పోలీస్ అధికారి సుధీర్ రాంనాథ్ కేకాన్, సిరోల్ పోలీస్ మరిపెడ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా , రికార్డుల నిర్వహణతో పాటు నామినల్ రోల్ (నామినీ రోల్), ప్రాపర్టీ రూమ్ (ప్రాపర్టీ రూమ్) ను సమీక్షించారు. అంతేకాక, స్టేషన్ పరిసరాలను తిరిగి పరిశీలించారు, శుభ్రత మరియు భద్రతాపరమైన ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.అనంతరం అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, కోర్టు కేసులు, లాంగ్ పెండింగ్ కేసులను పరిశీలిస్తూ, విచారణను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. విచారణలో ఏవైనా సందేహాలుంటే ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలని రెండు స్టేషన్ల ఎస్‌హెచ్ఓ లకు సూచించారు. పోలీస్ సిబ్బందికి ఉన్న సమస్యలను తెలుసుకొని స్పందించారు.ప్రత్యేకంగా మరిపెడ లో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ నీ పరిశీలించీ స్టేషన్ ఆవరణలో స్వయంగా ఎస్పీ తొర్రూర్ డిఎస్పి కే కృష్ణ కిషోర్ గార్లు మొక్కలు నాటడం జరిగింది, స్టేషన్లో సీజుడ్ వెహికల్స్ ని/క్రైమ్ వెహికల్స్‌నీ పరిశీలించడం జరిగింది.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి సిబ్బంది అన్నిరకాల విధులను తెలుసుకొని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం ద్వారా మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేలా ఉండాలని సూచించారు.వివిధ విభాగాల్లో మెరుగైన పనితీరు చూపి జిల్లా పేరు మెరుగుపడేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడాలని, 24లి7 అందుబాటులో ఉండి శాంతి భద్రతలు కాపాడేలా విధులు నిర్వహించాలని సూచించారు. **నేర నివారణపై దృష్టి:** హిస్టరీ షీట్ సస్పెక్టు లు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, నైట్ బీట్, పెట్రో లింగ్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్స్, రోడ్డు ప్రమాదాలపై కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. నేరాల నివారణకు, విచారణకు కీలకంగా ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, వీటి ఏర్పాటు కోసం ప్రజలను ప్రోత్సహించాలని చెప్పారు.రాబోయే ఎన్నికల దృష్ట్యా గ్రామాలపై అవగాహన కలిగి ఉండాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భనలో సీరోల్ స్టేషన్ ఎస్‌హె చ్‌ఓ శ్రీ జి. సంతోష్ కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎస్. రాజ్ కుమార్, డి సి ఆర్ బి సిఐ సత్యనారాయణ హెడ్ కానిస్టేబుల్ వీరయ్య, కానిస్టేబుళ్లు రేణుక, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.మరిపెడ పోలీస్ స్టేషన్ సిబ్బంది సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ ఎస్ హెచ్ ఓ సతీష్ ,మంగ్యా నాయక్ హెడ్ కానిస్టేబుల్ , కానిస్టేబుల్ అనిల్ కుమార్ రాజశేఖర్ సతీష్ సాయికిరణ్ స్వామి వెంకన్న తదితర సిబ్బంది ఉన్నారు.

# మీనాక్షి నాటరాజన్‌తో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు...



**హైదరాబాద్,జూలై29(పీసీడబ్ల్యూ న్యూస్):** పార్టీ సంస్థాగత, ఎన్నికల మరియు ప్రభుత్వ నామినేటెడ్ పదవుల భర్తీపై హైదరాబాద్ లో పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యతన, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ సెక్రటరీ విష్ణునాథన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఇంచార్జ్ వైస్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,ఎమ్మెల్యేలు, రాజ్ ఠాకూర్, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకునేది లేదు : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, జూలై29(పీసీడబ్ల్యూ న్యూస్):**రామంతపూర్ భగయత్ వెంకట సాయి నగర్ కాలనీ బీరప్ప దేవాలయం వెనకాల లైన్ లో సాంక్షన్ అయినటువంటి బాక్స్ కల్వర్ట్ ను అధికారులను తప్పుదోవ పట్టించి సాంక్షన్ అయినటువంటి బాక్స్ కల్వర్టు ను వెయ్యకుండా అడ్డుకుంటున్నారని వెంకట సాయి నగర్ కాలనీవాసులు ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని కలిసారు.ఈ మేరకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎవరు అభివృద్ధిని అడ్డుకుంటే వారిపైనా న్యాయ పరమైన చర్యలు చేపడతామని అన్నారు . ఇప్పటికే రామంతపూర్ భగయత్ కాలనీలకు కోటి రూపాయలు మంజూరు చేయించి డ్రైనేజీ లైన్లు పూర్తి చేయించామని శాంక్షన్ అయినటువంటి బాక్స్ కల్వర్టు కూడా త్వరలో శంకుస్థాపన చేసి పనులను పూర్తి చేయిస్తాను అని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు గంధం నాగేశ్వరరావు , సర్వ సత్తయ్య యాదవ్, గోపాల్,ఆర్ .గోవింద్, సీనియర్ పాత్రికేయులు ఏ విజయేందర్ రెడ్డి, శంకర్, శ్రీనివాస్ గౌడ్, అశోక్, నవీన్, కీర్తి ,చారి, సయ్యద్, చారి , తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పల్లెకు పోవాలి.... . గడపగడపకు బిజెపిని తీసుకెళ్లాలి...

- స్థానిక ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించండి..
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు ప్రజలు ఆదరించే పరిస్థితి లేదు..
- భవిష్యత్తు అంతా బిజెపిదే: బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి.





**గన్నేరువరం,జూలై29(పీసీడబ్ల్యూ న్యూస్):** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం బిజెపి నాయకులు కార్యకర్తలు అందరూ. ప్రతి పల్లె కు పోవాలని, భారతీయ జనతా పార్టీని గడపగడపకు తీసుకువెళ్లాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గన్నేరువరం మండల బిజెపి ముఖ్య నేతల సమావేశం సమావేశం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు పల్లె పల్లెకు బిజెపి కార్యక్రమాన్ని ఆగస్టులో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పల్లె పల్లెకు బిజెపి ప్రోగ్రాం ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులు పల్లె పల్లెకు బిజెపి ప్రోగ్రాం ను సక్సెస్ చేయాలన్నారు. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో కాషాయ జెండా రెపరెపలాడించాలని, బిజెపి శక్తి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ , బి ఆర్ ఎస్ పార్టీలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని అన్నారు. గత బిఆర్ఎస్ మాదిరిగానే నేటి కాంగ్రెస్ సర్కార్ పాలన కొనసాగుతుందని ఆయన విమర్శించారు. జూట మాటలు, హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ చేసింది గోరంతా అయితే కొండంత ప్రచారం చేసుకుంటుందని ఆయన ఘాటుగా విమర్శించారు. అరకోరా పథకాలను అమలుచేసి ప్రజలను నిలువునా మోసం చేసిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వం దే నన్నారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందడానికి మళ్లీ కాంగ్రెస్ రాజకీయ డ్రామాలు మొదలుపెట్టిందని, ప్రజలను మభ్యపెట్టడానికి మళ్లీ కొత్త నాటకాలు ప్రదర్శిస్తుందని ఆయన విమర్శించారు. ఊళ్ళల్లో కాంగ్రెస్ పై తీవ్ర వ్యతిరేకత మొదలైందని , జరగబోయే స్థానిక ఎన్నికల్లో ఆ ఫలితం కాంగ్రెస్ కు కనబడుతుందన్నారు, బి ఆర్ ఎస్ పార్టీ అసలు గుర్తించడం లేదని, ఆ పార్టీ అవుట్ డేటెడ్ పార్టీ అయిందన్నారు. ప్రజలంతా బిజెపి మోదీ ప్రభుత్వ పనితీరుపై విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కట్టుబడి మోదీ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ప్రజలంతా బిజెపి వైపు చూస్తున్నారని , ఇక భవిష్యత్తు అంతా బిజెపి దేనిని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మైపాల్ రెడ్డి ఓబీసీ మోచ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆడిచర్ల రాజు జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి,రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ, సీనియర్ నాయకులు ఎలేటి చంద్రారెడ్డి,కౌన్సిల్ మెంబర్ విలాసారం రామచంద్రం,కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, నాయకులు ఆరికొంతం అనిల్ రెడ్డి, పుల్లెల రాము,అట్టికం రామచంద్రం పంబాల రాజశేఖర్,దాడి గొప్ప వినయ్, బండి తిరుపతి, గాద వెంకన్న మద్దూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరుకాపులకు ప్రాధాన్యత ఇవ్వండి : డాక్టర్ కొండ దేవయ్య పటేల్



**హైదరాబాద్,జూలై29(పీసీడబ్ల్యూ న్యూస్):** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరుకాపులకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని తెలంగాణ మున్నూరుకాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ ప్రధాన రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీల్లో అత్యధిక జనాభా కల్గి రాజకీయంగా ఆయా పార్టీల్లో వేల సంఖ్యలో మున్నూరుకాపు నేతలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మంగళవారం బర్కతుర లోని సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరుకాపులను గెలిపించుకునే బాధ్యత సంఘం తీసుకుంటుందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు మున్నూరుకాపులు అందిస్తున్న సేవలను గుర్తించి ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలని కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలవడగానే ఆయా పార్టీల అధినేతలను కలిసి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేయనున్న మున్నూరుకాపు అభ్యర్థుల వివరాలతో కూడిన జాబితాను అందించనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉత్సాహంగా ఉన్న మున్నూరుకాపు నేతలు తమ పేర్లను సంఘ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఒక లక్ష మందితో సంఘం సభ్యత్వాన్ని సేకరించడమే లక్ష్యంగా పటేల్స్ సంఘం కృషి చేస్తుందని తెలిపారు. సభ్యత్వ సేకరణలో సంఘ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# యన్. ఎస్.ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్లో సత్తా చాటిన శ్రీ చైతన్య రామంతాపూర్ విద్యార్థులు




**ఉప్పల్,జూలై29(పీసీడబ్ల్యూ న్యూస్):** చైతన్య రామంతపూర్ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ నాసా సెటిల్ మెంట్ ఇన్ హెల్త్ స్పేస్ డిజైన్ కాంటెస్ట్ లోని న్యూబిలాక్ అండ్ నేషనల్ వైడ్ హానరబుల్ మెన్షన్ కామెట్ సాధించినందుకు పాఠశాల ఏ.జి. యం. మహమ్మద్ నూర్ అలి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలని అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీతి రెడ్డి సెంటర్ ఫర్ డిఎన్ఏ టెక్నికల్ ఆఫీసర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మనం ఇతర గ్రహాలను అంతరిక్షాన్ని ఎందుకు అన్వేషించాలి? అంతరిక్ష స్థిర నివాసం అనేది మానవ జాతికి ఒక గొప్ప వరం,ఏదైనా ఒక విపత్తు కారణంగా భూమిపై మానవ జాతి అంతరించిపోయె ప్రమాదం ఉందని, అంతరిక్షంలో స్థిర నివాసాలు ఉండడం వల్ల, మానవజాతి అంతరించి పోకుండా కాపాడు కోవచ్చు, అంతరిక్షంలో స్థిర నివాసాలు నిర్మించడానికి మరియు నిర్వహించు డానికి సరి కొత్త సాంకేతికతలు అవసరం. మన శాస్త్రజ్ఞులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి మరియు మన శాస్త్రీయ పరిజ్ఞానాన్ని విస్తరించడానికి సరికొత్త ప్రయోగాలు చేపడుతున్నారని భూమి అందమైన గ్రహం దానిని కాపాడుకోవలసిన బాధ్యత మనందరి పైన ఉందని విశ్లేషించి, సత్తా చాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగియున్న సృజనాత్మకతను వెలికి తీసి, మెరుగులు దిద్దితే భవిష్యత్తులో దేశాభివృద్ధికి పాటు పడుతారని ప్రస్తావిస్తు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్ మరియు మెమొంటోలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్స్ పాల్ శ్రీ కీర్తి కోన, ఆర్.ఐ. మల్లిఖార్జున నాయుడు, జోనల్ ఎగ్జిక్యూటివ్ డోన్ పుల్లారావు, జోన్ కో ఆర్డనేటర్ రాజేంద్రప్రసాద్ డీన్. నాగరాజు, ఇంచార్జులు అరుణ్ కుమార్, వెంకటేశ్ గుప్త మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్




**హన్మకొండ జులై 29(పిసిడబ్ల్యు న్యూస్):** పరకాల పట్టణంలో పలువురు లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి గురించి లబ్ధిదారులు, అధికారులతో కలెక్టర్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు కలెక్టర్ సూచించారు. అదేవిధంగా సైడ్ డ్రైనేజీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డిఓ డాక్టర్ కే నారాయణ, తహసిల్దార్ విజయలక్ష్మి, పురపాలక కమిషనర్ సుష్మ, ఎంపీడీవో ఆంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విలేకరుల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, సూడ చేర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి..



**కరీంనగర్ టౌన్, జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి వర్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి, సూడ చేర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు, జీవన్ రెడ్డి మాట్లాడుతూ... బీజేపీ పాలనలో ఉన్న గుజరాత్, మహారాష్ట్ర లో ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తుంది తెలంగాణ రాష్ట్రానికి ఎందుకు ఈ వివక్ష రాజ్యాంగంలో దళితులు, గిరిజనలకు జనాభా ప్రాతిపదిక నా నిర్దేశినట్లుగా బలహీన వర్గాల ప్రజలకు రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగం లో స్పష్టంగా పేర్కొన్నారు.ఇంపీరియల్ డాటా ద్వార రిజర్వేషన్ పొందే వారినీ గుర్తించాలని,సామాజిక వెనకబాటు తనం గురి అవుతున్న వర్గాలను వారీ జనాభాకు అనుగుణగం డెడికేటెడ్ కమిషన్ ద్వారా నిర్ధారించాలని కోర్టు నిర్దేశించింది.సామాజిక వేనకబాటుకు గురి అవుతున్న వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం కాంగ్రెస్ పార్టీ విధానం.సాంకేతిక సమస్యలు ఎదురుకాకుండా డెడికేటెడ్ కమిషన్ సామాజిక వెనకబాటు గురి అవుతున్న వారు 56 శాతం గా పేర్కొనగా 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు శాసన సభ, శాసన మండలి లో ఆమోదం తెలిపి,గవర్నర్ పరిశీలించి నివేదిక రాష్ట్రపతికి పంపారు.మూడు నెలలు అవుతున్న రాష్ట్రపతి ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదు. ఏ బిల్లు అయిన రాష్ట్రపతి మూడు మాసాల్లో నిర్ణయం తీసుకోకుంటే అమలు చేసినట్లే అని సుప్రీమ్ కోర్టు తీర్పు ఇచ్చింది.రిజర్వేషన్లు షెడ్యూల్ లో 9లో చేర్చబడితే చట్టబద్ధత వస్తుంది. రాష్ట్ర శాసన సభ, శాసన మండలి లో బీజేపీ మద్దతు తెలిపి,9 వ షెడ్యూల్ లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదు. న్యాయ పరమైన సమస్యలు తలెత్తకుండా షెడ్యూల్ 9లో చేర్చాలి ఉండగా, కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత విస్మరించింది.రాష్ట్రంలో రిజర్వేషన్ అమలు బిల్లు కు బీజేపీ మద్దతు తెలిపి జాతీయ ఓబీసీ నాయకులు 42 శాతం రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి వద్ద ఉండగా ఆర్డినెన్సు ఎలా తీసుకు వస్తారంటూ ప్రశ్నిస్తుండడం విడ్డూరంగా ఉంది. 42 శాతం బీసీ రిజర్వేషన్ లో ముస్లింలను చేరుస్తున్నారు ముస్లింలకు రిజర్వేషన్ కల్పనకు మేము అనుకూలంగా లేము భిన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాం అంటున్నారు,ఇదే భారతీయ జనతా పార్టీ గుజరాత్ లో మహారాష్ట్ర లో బిజెపి పాలన ఉన్నది ఈ రెండు రాష్ట్రాలలో కూడా సామాజిక వెనుకబాటుతనానికి గురవుతున్నటువంటి ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తున్నది,హిందువులు అందరికీ కూడా రిజర్వేషన్ సౌకర్యం లేదు హిందువులలో కూడా సామాజిక వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్ సౌకర్యము అలాగే ముస్లింలలో కూడా అందరికీ కాదు సామాజిక వెనుకబాటుతనానికి గురవుతున్నటువంటి వారికి రిజర్వేషన్ ఇది కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాదు బిజెపి పాలనలో ఉన్నటువంటి గుజరాత్ మహారాష్ట్రలో సామాజిక వెనుకబాటుతనానికి గురవుతున్నటువంటి ముస్లింలకు రిజర్వేషన్ ఆంధ్రప్రదేశ్ లో కూడా ప్రభుత్వంలో కూడా సామాజిక వెనుకబడి తనానికి గురవుతున్నటువంటి ముస్లింలకు రిజర్వేషన్ అమలు చేస్తున్నారు,మీరు తెలంగాణకు వచ్చే సారికి ఈ వివక్ష ఈ రెండు నాలుకల ధోరణి ఎందుకు కిషన్ రెడ్డి సీనియర్ రాజకీయ నాయకులు బండి సంజయ్ కూడా సీనియర్ నాయకులు రెండు పర్యాయాలు పార్లమెంట్ మెంబర్ కేంద్రంలో మంత్రి రామచంద్ర రావు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మతపరమైన రిజర్వేషన్ సుముఖంగా లేరు అని చెపుతున్నారు, మతపరమైన రిజర్వేషన్ సౌకర్యం కల్పనకు కాంగ్రెస్ కూడా సుముఖంగా లేదు, కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న రిజర్వేషన్ కేవలం సామాజిక వెనుకబాడుతనానికి గురవుతున్న వారికి మాత్రమే హిందువులలో కానీ ముస్లింలలో కానీ సిక్కు కిసాయ్ ఎవరు అయిన సామాజిక వెనుకబడుతనానికి గురి అవుతున్న వారికి మాత్రమే రిజర్వేషన్ సౌకర్యం కల్పింపచేయడం జరుగుతుంది,42 శాతం రిజర్వేషన్లు 10 శాతం ముస్లింలే పట్టుకపోతారు బిజెపి వారి లెక్కేందో అర్థం కావడం లేదు, తెలంగాణ రాష్ట్రంలో సామాజిక వెనుకబాటుతనానికి గురవుతున్నటువంటి వారి జనాభా 56% రావడంతోని 56 దృష్టిలో ఉంచుకొని 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని భావిస్తున్నారు, 56% లో 10 శాతం ముస్లిం జనాభా ఉన్నది 56% నుండి 10 శాతం తీసేస్తే 46% అవుతుంది 46% అవుతే 42 శాతం సాధ్యమేనా 42 శాతం రిజర్వేషన్ కల్పనకు ముస్లిం జనాభా సామాజిక వెనుకబాటుతనానికి గురవుతున్నటువంటి వారిని చేర్చడంతోనే 56% కు వచ్చాం,స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో క్యాటగిరేషన్ లేదు అటువంటప్పుడు 10 శాతం ఎలా పేర్కొంటారు, ఉదాహరణకు గ్రామీణ ప్రాంతం మనం పోయినట్టయితే ఏ గ్రామంలో కూడా ముస్లిం జనాభా 1% కూడా ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలలో ఉండదు ఎందుకు ఆ విషయాన్ని తప్పు దోవ ఇచ్చే విధంగా ప్రవర్తిస్తున్నావు,విద్య ఉద్యోగాలలో కూడా ముస్లింలకు 1.08% అదనంగా వస్తుంది గతంలో ఇచ్చే 4 శాతం కలుపుకుని 5.8 మాత్రమే కానీ 10 శాతం అని బీజేపీ నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారు అని అన్నారు,సామాజిక న్యాయం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి, సామాజిక వెనకబాటుకు గురి అవుతున్న వారికి హక్కులు కల్పించాలి అని సంకల్పంతో అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి, రాష్ట్ర ప్రభుత్వం బిల్లు రాష్ట్రపతికి నివేదించింది.బండి సంజయ్ బలహీన వర్గాల నాయకులు ఆయన ముందు ఉండి పోరాటం చేయాలి వారు కూడా కిషన్ రెడ్డి రాంచంద్ర రావు లాగా మాట్లాడితే ఎలా అన్నారు, బలహీన వర్గాల రిజర్వేషన్ కొరకు బండి సంజయ్ గారు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి 9 షెడ్యూల్ లో చేర్చే విదంగా చోరవ చూపాలి పార్లమెంట్ లో కేంద్ర హోంశాఖ పై కానీ ప్రధాన మంత్రి గారి పై ఒత్తిడి తేవాలి అన్నారు,42 శాతం స్థానిక సంస్థల్లోనే కాదు విద్యా, ఉద్యోగాల్లో కూడా 42 శాతం అమలు చేస్తాం.. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు కోసం కాంగ్రెస్ పార్టీ సంకల్పంతో పని చేస్తుండగా ఎక్కడ కాంగ్రెస్ కు పేరు వస్తుందో అని విమర్శించడం దురదృష్టకరం. 9 వ షెడ్యూల్ లో చేర్చాల్సిన బాధ్యత బీజేపీ పై ఉంది. బీజేపీ 9 వ షెడ్యూల్ చేర్చకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గముగాఆర్డినెన్సు కు తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్ళాల్సి వస్తుంది.ఆర్డినేన్స్ తీసుకురావడానికి బీజేపీయే కారణం. బీజేపీ రాజకీయం చేసే ప్రయత్నం చేయకుండా,సామాజికంగా వెనకబాటుతనానికి గురి అవుతున్న వారికి సామాజిక న్యాయం కల్పించేలా అందరూ సహకరించాలి అని మాజీ మంత్రి వర్యులు జీవన్ రెడ్డి కోరారు.

# గురుకులాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**● విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం**



**గంగాధర, జూలై 29 (పిసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం గంగాధరలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను, మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. బీసీ బాలుర వసతి గృహంలో తరగతి గదులను, స్టోర్ రూమును, మంటగదిని పరిశీలించారు. విద్యార్థులు కూర్చుండేందుకు సరఫరా చేసిన గ్రీన్ మ్యాట్లను ఉపయోగించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం నుండి సరఫరా ఆయన ప్రతి వస్తువును విద్యార్థుల కోసం వినియోగించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విశ్రాంతి తీసుకుంటున్న పలువురు విద్యార్థులతో మాట్లాడారు. జ్వరం, విరేచనాలు వంటి అనారోగ్యం వస్తే అప్రమత్తంగా ఉండాలని హాస్టల్స్ సిబ్బందికి సూచించారు. నిర్దిష్ట సమయం ప్రకారం వైద్యాధికారితో ప్రతి విద్యార్థికి వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మెడికల్ రిజిస్టర్ను తనిఖీ చేసి విద్యార్థులకు ఇచ్చిన మందులను పరిశీలించారు. విద్యార్థులకు ఓఆర్ఎస్ ద్రావణం అందజేయాలని అన్నారు. మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఇక్కడ వంటగది సరుకుల గదిని తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన కామన్ డైట్ మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు ఇవ్వాలని ఆదేశించారు. తరగతి గదులు పరిశీలించిన కలెక్టర్ ఆరవ తరగతి విద్యార్థులను ఇంగ్లీష్ కు సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.కలెక్టర్ వెంట బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్ ఉన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో పేదల కల సాకారం

**● నూతన రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**





**గంగాధర జులై 29 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ లో గడిచిన పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డు ఊసే లేకుండా పేదోళ్ళను కడుపు కొడితే, రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతీ ఒక్కరికి ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశ్యంతో రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న నేపథ్యంలో చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం జీవీర్ కన్వెన్షన్ హాల్లో నూతనంగా మంజూరు అయిన (2109) రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ పమేలాబిసత్పతి తో కలిసి లబ్ధిదారులకు అందించిన చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం.

# బిజెపి బీసీల ద్రోహిగా మారద్దు..

**● కేంద్రమంత్రిగా బండి సంజయ్ భేషరతుగా బీసీ రిజర్వేషన్లకు మద్దతు ప్రకటించాలి**

**● ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్..**




**కరీంనగర్ టౌన్ జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బీసీ రిజర్వేషన్లను ముస్లిం డిక్లరేషన్ గా పేర్కొంటూ చేసిన వ్యాఖ్యలను జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ తీవ్రంగా ఖండించినారు. ఈ మేరకు నేడు వారు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..ఎన్నికల ప్రచారంలో భాగంగా జాతీయ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ మాటకు కట్టుబడి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం లోపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ దేశం యావత్తు ఆశ్చర్యపోయే విధంగా రాష్ట్రవ్యాప్తంగా కుల గణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగింది.తెలంగాణ రాష్ట్ర ప్రజలు 8 మంది బిజెపి ఎంపీలను గెలిపిస్తే, ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు, దీనిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఎంపీలు ఈటల రాజేందర్ ధర్మపురి అరవిండ్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పితిరాలి.గతంలో తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షునిగా పనిచేసి, బిజెపి పార్టీ నుండి కరీంనగర్ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న బండి సంజయ్ ఒక బీసీగా బీసీ రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వకుండా కేవలం రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీసీ రిజర్వేషన్లకు మతాన్ని అంటగడుతూ కొత్త ప్రచారానికి తరలింపుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ముస్లిం డిక్లరేషన్ అంటూ బండి సంజయ్ ఒక రాజకీయ అజ్ఞానిగా మాట్లాడుతున్నారు.రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రంలో బీసీ డిక్లరేషన్ అమలు గురించి విప్లవత్మక నిర్ణయం తీసుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి ఢిల్లీ పర్యటనలు చేపట్టి జాతీయ నేతల ప్రశంసలు పొందుతుంటే, బీసీ సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్ మా ప్రధాని నరేంద్ర మోడీ బీసీ అని చెప్పుకుంటూనే బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారు అని జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ పక్షాన ప్రశ్నిస్తున్నాం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ డిక్లరేషన్ కు మద్దతు ఇస్తుంటే బీసీ సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్ బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న తీరును దాని వెనుక ఉన్న కుట్రను యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు,రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిపై, మంత్రి పొన్నం ప్రభాకర్ పై బిజెపి నేతలు చేస్తున్న అర్థం లేని ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలి వేస్తున్నాంబీసీల పట్ల బండి సంజయ్ కి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న స్థానిక సంస్థల ఎన్నికల లోపు ఢిల్లీ బిజెపి జాతీయ నేతలను కలిసి బీసీ రిజర్వేషన్లకు అనుకూల ప్రకటన చేయించాలని డిమాండ్ చేస్తున్నాము, యూపీఏ హయాంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీగా పొన్నం ప్రభాకర్ అధిష్టానాన్ని ఎదిరించి తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన తీరును స్ఫూర్తిగా తీసుకొని బండి సంజయ్ బిసి రిజర్వేషన్లపై ప్రధాని నరేంద్ర మోడీని ఒప్పించాలని కోరుతున్నాము, బీసీ రిజర్వేషన్లను ముస్లిం డిక్లరేషన్ గా అభివర్ణించిన బండి సంజయ్ వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, ప్రధాని నరేంద్ర మోడీపై ఒత్తిడి తీసుకువచ్చి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను అమలుపరిచే విధంగా కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ పక్షాన కోరుతున్నాం.ఈ సమావేశంలో రామిడి తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు సాయిరి దేవన్న, నూనె గోపాల్ రెడ్డి, పోతుగంటి శ్రీనివాస్, వంగల విద్యాసాగర్, వరహాల చారి, కుంభాల రాజకుమార్, బండి పెల్లి ప్రవీణ్ కుమార్, గండికోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అసలైన ఎస్సీ కులానికి న్యాయం చేయాలి

**● తాసిల్దార్‌కి దళిత సంఘాలు వినతిపత్రం అందజేత**



**చిట్యాల, జులై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో చిట్యాల తాసిల్దార్ గారికి బాలసంత కాటిపాపల కులస్తులకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వద్దాన్ని చల్లగరిగే ముసినిపర్తి,చిట్యాల గ్రామాల నుండి దళితులు వచ్చి చిట్యాల తాసిల్దార్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఇతర కులాలకు చెందిన వారు మేమే బెడ బుడగ జంగం అని మాకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వమని ఎవరైన అప్లికేషన్ పెట్టిన కూడా వారు గతంలో ఏ పాఠశాలలో చదువుకున్నటువంటి అడ్మిషన్ రిజిస్టర్ను ఎంక్వయిరీ చేసి వారికి ఇవ్వగలరని ఎందుకంటే వాళు ఏదో సర్టిఫికెట్ పట్టుకొచ్చి మేము తీసుకొని దళితులకు అసలైన ఎస్సీ కులానికి చెందిన వాళ్లకు అన్యాయం జరుగుతున్నది ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు లబ్ది పొందడం కోసం మరియు రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం వాళ్ళు పోటీ చేయడం కోసము తయారవుతున్నందున వారికి జిల్లా కలెక్టర్ తో విచారణ జరిపించి ఇవ్వగలరని అన్నారు గతంలో చదువుకున్నటువంటి పాఠశాలలో అడ్మిషన్ రిజిస్టర్ లను తీసుకువచ్చి చిట్యాల తాసిల్దార్ గారికి చూపెట్టడం జరిగింది మేము సాక్ష్యాలు ఆధారాలు కూడా ఉన్నాయని అన్నారు.గతంలో ఎలాంటి విచారణ లేకుండా తప్పుగా సర్టిఫికెట్లు ఇచ్చిన అధికారులను సస్పెండ్ చెయ్యాలి లేనిచో దళిత సంఘాల ఆధ్వర్యం లో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని దళిత హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య. (ఎమ్మార్పీఎస్) మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు జేరిపోతుల ఓదెలు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు దూడపాక సాంబయ్య. డిఎస్పి నాయకులు పుల్ల అశోకు చల్లగరియా ముచి నీపర్తి గ్రామాల చెందిన దళిత సంఘాల నాయకులు సోమిడిరఘుపతి దూడపాక దివాకరు నోముల శివశంకరు సిరి పెల్లి నరేష్ కొల్లూరి అశోక్ దూడపక రాజు పాల్గొన్నారు

# పరకాల పట్టణం అభివృద్ధి చెందాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- పరకాల పురపాలక సంఘం నూతన జెసిబి యంత్రం, స్వచ్ఛ ఆటోలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి






**హన్మకొండ, జులై 29(పిసిడబ్ల్యు న్యూస్):** పరకాల పట్టణం దినదినం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో 15వ ఆర్థిక సంఘం, టైడ్ గ్రాంట్స్ ద్వారా రూ. 47.74 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన జెసిబి యంత్రం, అదేవిధంగా రూ. 87.55 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఆరు స్వచ్ఛ ఆటో లను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అధికారులు, స్థానికుల సమక్షంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. పారిశుద్ధ్య సిబ్బందికి ఎమ్మెల్యే, కలెక్టర్ల చేతుల మీదుగా దుస్తుల పంపిణీ చేశారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే, కలెక్టర్ మొక్కలు నాటారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మెప్మా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ స్టాల్స్ ను ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాల స్టాల్స్ ను ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అనేక ప్రాధాన్య కార్యక్రమాలతో పాటు పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యత నిస్తుందన్నారు. గ్రామాలు, పట్టణ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతని ఇస్తుందని, ప్రజా ప్రతినిధుల బాధ్యత కూడా అని పేర్కొన్నారు. పరకాల పట్టణంలోని పలు డివిజన్లను పరిశీలించి నప్పుడు 34 వేలకు పైగా జనాభా ఉన్నారని, పరకాల పట్టణం దినదినం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. పరకాలకు చరిత్ర ఉందని అన్నారు. రజాకార్ల ఉద్యమంలో, స్వాతంత్ర్య ఉద్యమంలో ఇక్కడి నుండి పాల్గొన్న వారు ఉన్నారని గుర్తుకు చేశారు. ఇక్కడ ఉద్యమకారులు రజాకారుల చేతుల్లో ఊచ కోత కోయబడ్డారని అన్నారు. దానికి గుర్తుగా రకాల పట్టణంలో అమరధామం నిర్మించారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పరకాల పురపాలక సంఘానికి ఒక్కో స్వచ్ఛ ఆటోను 15 లక్షల వ్యయంతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రజలు తడి పొడి చెత్తగా వేరు చేయాలని సూచించారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీలో చెత్త, వ్యర్థాల నిర్వహణ సమస్యగా మారిందన్నారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు తడి పొడి చెత్త నిర్వహణకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కాలనీల్లో కంపోస్టు యూనిట్ ను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు మరిన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మహిళలు ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేసి నైపుణ్యాలను పెంపొందించే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళలకు అందిస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు పరకాలకు ఇందిరమ్మ ఇండ్లు పెద్ద ఎత్తున మంజూరు చేయడం జరిగిందని, వాటి పురోగతి తక్కువగా ఉందన్నారు. ఇంకా ఇండ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టనివి వంద వరకు ఉన్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించుకొని వారికి మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలను ఇప్పిస్తామన్నారు. వారం రోజుల్లో ఇండ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టాలని, నిర్మాణ పనులు మొదలు పెట్టిన లబ్ధిదారులు త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు.అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, పరకాల పురపాలక సంఘం కమిష నర్ సుష్మ, ఆర్డీఓ డాక్టర్ కే నారాయణ, తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో ఆంజనేయులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బస్సు సౌకర్యం కప్పించండి

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మాజీ సర్పంచ్ మేకల ప్రభాకర్ యాదవ్




**గంగాధర, జులై 29(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మోడల్ స్కూల్ విద్యార్థుల సౌకర్యం కోసం మరియు మోతె కొరటపెల్లి మీదుగా వయ గోపాలరావుపెట్ నుండి పెగడపెల్లి వరకు కూడా బస్సు సౌకర్యం కల్పించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ని గ్రామస్తులు కలిసి విన్నవించుకోగా వెంటనే RTC RM% గారికి కేంద్ర మంత్రి మౌలిక ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ సర్పంచ్ మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ కొత్తపెల్లి నుండి వయ మోతె గ్రామం మీదుగా బస్సు సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో మేము బీజేపీ నాయకుల విజ్ఞప్తి మేరకు జగిత్యాల డిపో నుండి పెగడపెల్లి వయ గోపాలరావుపెట్ మోతె,కొరటపెల్లి మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందచేయడం జరిగింది,అధికారులు కూడా స్పందించి అప్పుడు బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని, ఇప్పుడు ఆ బస్సు ఎటు పోయిందని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆ బస్సు సౌకర్యం లేక ఇతర గ్రామాలకు వెళ్లే ప్రజలు,కాలేజి విద్యార్థులు, కూలికి వెళ్లే కూలీలు,ఇతర వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మోడల్ స్కూల్ విద్యార్థులు కూడా బస్ సౌకర్యం లేక స్కూల్‌కి రెండు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారని, విద్యార్థులనుప్రజలను పట్టించుకోకుండా ఇక్కడి స్థానిక ఎమ్మెల్యే ను వెంటనే ఈ రెండు బస్సులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో మరియు ఆయా గ్రామాల ప్రజలతో కలిసి RTC కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. సానుకూలంగా స్పందించి RM గారికి మౌలిక ఆదేశాలు జారీ చేసిన మంత్రి గారికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారుఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వేముండ్ల కుమార్,నాయకులు శేవాళ్ళ అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఈడీ అభ్యర్థుల మహా పాదయాత్రను విజయవంతం చేద్దాం

### - యాదాద్రి జిల్లా అధ్యక్షులు తలారి గణేష్



**రామన్నపేట జులై 29(పీసీడబ్ల్యూ న్యూస్):** 'స్కూల్ అసిస్టెంట్ పోస్టుల డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటాలో బీఈడీ అభ్యర్థులకు కేవలం 30 శాతం ఇస్తూ ఎస్జీటీలకు 70 శాతం ప్రమోషన్స్ ఇవ్వడాన్ని నిరసిస్తూ.. తమకు కనీసం 80 శాతం తగ్గకుండా కొటా ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర బీఈడీ అభ్యర్థుల సంఘం మహా పాదయాత్ర నిర్వహించ తలపెట్టింది. ఈ మహా పాదయాత్ర ఆదివారం ఆగస్టు 3 నుంచి గురువారం 7 వరకు ఉంటుంది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నుంచి హైదరాబాద్ లోని ఎస్సీఆర్టీ(ఎస్సీ ఆర్ టి -విద్యా కమిషన్) వరకు పాదయాత్ర కొనసాగుతుంది. రాష్ట్రంలోని అభ్యర్థులంతా అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయడంలో భాగస్వామ్యమవ్వాలి. నవంబర్, డిసెంబర్ నెలల్లో 10,000 పోస్టుల నోటిఫికేషన్ వస్తుందని అంటున్నారు. మన పోస్టుల కోసం మనం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. కావున అధిక సంఖ్యలో పాల్గొనాలి. ఇది అందరి సమస్యా పరిష్కారం కోసమని గ్రహించగలరు.

# ఉపాధ్యాయ లోకానికి మార్గదర్శి ప్రధానోపాధ్యాయులు హరి సింగ్ రాథోడ్

- చందూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి పదవి విరమణ కార్యక్రమంలో చిలిపిచేడు మండల విద్యాధికారి పి.విట్టల్

**సంగారెడ్డి ప్రతినిధి జులై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** మెదక్ జిల్లా జిల్లా చిలిపిచేడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చందూర్ ప్రధానోపాధ్యాయుడికి పదవి విరమణ అభినందన సభ ఘనంగా నిర్వహించడం జరిగింది .విద్యా రంగంలో 36 సంవత్సరాలు ప్రశంసనీయమైన సేవను అందించిన తర్వాత ఈరోజు పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడు హరి సింగ్ రాథోడ్ కి హృదయపూర్వక వీడ్కోలు పలికారు. ఆయన పదవీ విరమణ చందూర్ పాఠశాల లో ఒక శకం ముగింపును సూచిస్తుంది, అక్కడ ఆయన మార్గదర్శక శక్తిగా, స్ఫూర్తిదాయక నాయకుడిగా చాలా మందికి మార్గదర్శకుడిగా ఉన్నారు. 2023 ఈ పాఠశాలలో చేరిన హరి సింగ్ విద్యార్థుల విద్యా నైతిక వృద్ధికి తనను తాను అంకితం చేసుకున్నారు. ఆయన నాయకత్వంలో, పాఠశాల అనేక మైలురాళ్లను సాధించింది, వాటిలో లయన్స్ అవార్డులు, ఉత్త ఉపాధ్యాయులు అవార్డులు ఎన్నో రావడం జరిగింది. పాఠశాల ప్రాంగణంలో సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ప్రముఖుల సమక్షంలో ఈ వీడ్కోలు కార్యక్రమం జరిగింది. భావోద్వేగ ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలు సన్మాన కార్యక్రమం ఈ సందర్భంగా జరిగింది. సిబ్బంది విద్యార్థులు జ్ఞాపికలు హృదయపూర్వక శుభాకాంక్షలతో తమ కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రసంగంలో హరి సింగ్ తన సహోద్యోగులకు, విద్యార్థులకు సమాజానికి వారి నిరంతర మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన తన ప్రయాణంలోని జ్ఞాపకాలను పంచుకున్నారు విద్యార్థులు శ్రేష్ఠత క్రమశిక్షణ కోసం కృషి చేయడం కొనసాగించాలని కోరారు. హరి సింగ్ పదవీ విరమణ జ్ఞానం, అంకితభావం అవిశ్రాంత సేవ యొక్క వారసత్వాన్ని మిగిల్చింది. ఆయనను సమర్థుడైన నిర్వాహకుడిగా మాత్రమే కాకుండా, ఎల్లప్పుడూ విద్యార్థులను ముందు ఉంచే దయగల విద్యావేత్తగా కూడా గుర్తుంచుకుంటారని మండల విద్యాధికారి విట్టల్, తెలియజేయడం జరిగింది. మేము ఆయనకు ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన సంతృప్తికరమైన పదవీ విరమణ జీవితాన్ని కోరుకుంటున్నాము. అని మండలంలోని వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తెలియజేయడం జరిగింది .మండలంలోని వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు బంధుమిత్రులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ,విద్యార్థులు పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# అందోల్‌లో మీనాక్షి నటరాజన్ పర్యటనను విజయవంతం చేయాలి

- ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి. సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- మీనాక్షి నటరాజన్ చేపట్టిన పాదయాత్ర లో స్వచ్ఛందంగా కార్యకర్తలు వేలాదిగా పాల్గొనాలి
- అందోల్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మంత్రి దామోదర్ రాజనరసింహ వెల్లడించారు



**సంగారెడ్డి ప్రతినిధి జులై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆగస్టు 1న సాయంత్రం 5 గంటలకు అందోల్ నియోజక వర్గంలో చేపట్టిన పాదయాత్ర తో పాటు ఆగష్టు 2న జరిగే శ్రమదానం,పార్టీ కార్యకర్తల తో సమావేశం ను విజయవంతం చేయటానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన సంగారెడ్డి లోని తన నివాసం లో నియోజక వర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలతో ఆత్మీయ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో కాంగ్రెస్ పార్టీ లో ఉన్న అన్ని విభాగాల శ్రేణులు స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పార్టీ ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ కోరారు. ఈ ఆత్మీయ సమన్వయ సమావేశంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంజయ్య,అందోల్ నియోజక వర్గం లోని కాంగ్రెస్ పార్టీ 9 మండలాల అధ్యక్షులు,ఆత్మ కమిటీ ల అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్ లు, మాజీ జడ్పీటీసీలు. మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచ్ లు,మాజీ ఎంపీటీసీలు,మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు,వివిధ గ్రామాల అధ్యక్షులు,యూత్ విభాగం నియోజక వర్గ ముఖ్య నేతలు,పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

